అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com

సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:147
Vol-01 ::: Issue-147

హైదరాబాద్ 28 డిసెంబర్ 2025, ఆదివారం
Hyderabad 28 December 2025, Sunday

పేజీలు: 8, వెల: రూ. 5/-
Pages: 8, Rs. 5/-

అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com



## ఆర్ఎస్ఎస్, బీజేపీలపై డిగ్గీరాజా ప్రశంసలు

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

శశిథరూర్ ఉదంతం మరువక ముందే, కాంగ్రెస్ పార్టీకి మరో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ రూపంలో కొత్త తలనొప్పి వచ్చి పడింది. ప్రధాని మోదీకి సంబంధించిన ఒక పాత ఫొటోను షేర్ చేస్తూ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారాయి. మొన్నటివరకు ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ కేంద్రంపై, ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ, సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. గుజరాత్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్, ఆ సందర్భంగా సోషల్ మీడియాలో ఒక ఫొటో షేర్ చేసి, సంచలన కామెంట్ ను జోడించారు.

...::: తరువాయి 3వ పేజీలో..

## ట్రంప్-జెలెన్‌స్కీ భేటీ వేళ.. రష్యా డ్రోన్ల దాడి



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ భేటీ నేపథ్యంలో ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడులు కొనసాగుతున్నాయి. రాజధాని కీవ్ లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో రష్యా విరుచుకుపడుతోంది. ఉక్రెయిన్ ఇంధన, మిలిటరీ సదుపాయాలే లక్ష్యంగా ఈ దాడులు చేపట్టామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కీవ్ తమ దేశంలోని జనావాసాలపై చేసిన దాడులకు ప్రతీకారంగా, ఈ చర్యలు చేపట్టామని రష్యా సైనిక దళం పేర్కొంది.ఈ భారీ దాడులలో మొత్తం 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. కీవ్‌తో పాటు పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలతో దద్దరిల్లింది. ఇదిలా ఉండగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫ్లోరిడాలో, ఆదివారం సమావేశం కానున్నారు. శాంతి ఒప్పందానికి సంబంధించిన కొన్ని పత్రాలు పూర్తిగా సిద్ధం కాగా, మరికొన్ని తుది దశకు చేరుకున్నట్టు సమాచారం.


## మునీర్ దెబ్బతో పాక్ కు... మేధావులు గుడ్ బై



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

పాకిస్తాన్ లో వేల సంఖ్యలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు దేశాన్ని విడిచి వెళ్తున్నారు. గత రెండేళ్లలో 5,000 మంది డాక్టర్లు, 11,000 మంది ఇంజినీర్లు, 13,000 మంది అకౌంటెంట్లు పాక్ ను వీడి వెళ్లినట్లు ఓ ప్రభుత్వ నివేదిక ద్వారా వెల్లడైంది. దేశ చరిత్రలోనే 'మేధో వలస' తో ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ కు తలనొప్పిగా మారింది. సైనిక పెత్తనం పెరగడంతో మేధావులంతా దేశం విడిచి వెళ్లిపోతున్నారు. దేశం ఈ స్థాయిలో కుదేలవుతుంటే పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలపై, నెటిజెన్లు కామెంట్లతో హల్ చల్ చేస్తున్నారు. పాక్ లో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యంత దారుణమైన 'బ్రెయిన్ డ్రెయిన్' సంక్షోభం తలెత్తింది. దేశంలో బతకడం దుర్భరంగా మారడంతో వేలాది మంది డాక్టర్లు, ఇంజినీర్లు, అకౌంటెంట్లు దేశాన్ని వీడి విదేశాలకు వెళ్లిపోతున్నారు.

...::: తరువాయి 3వ పేజీలో..



## బంగ్లాలో రాక్‌స్టార్ పై దాడి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్ననేపథ్యంలో ప్రముఖ రాక్‌స్టార్ జేమ్స్ సంగీత విభావరిపై అల్లరి మూక దాడికి తెగబడింది. ఫరీదాపూర్‌లో ఒక పాఠశాల 185వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ గాయకుడు జేమ్స్ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతో పాటు వేలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు చేరుకున్నారు. విభావరి ప్రారంభానికి ముందే కొంతమంది గుర్తుతెలియని ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకొచ్చారు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకురాలేకపోయారు.

...::: తరువాయి 3వ పేజీలో..

**భారత్‌లో అమెరికాకు చెందిన టెక్ దిగ్గజాలు డాలర్లు కుమ్మరిస్తున్నాయి. అమెజాన్, గూగుల్, మెటా వంటి బహుముఖ దిగ్గజాలు భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. గ్లోబల్ డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మౌలిక సదుపాయాలకు భారత్ ముఖ్య వేదికగా మారనుంది. ఈ పెట్టుబడులు భారత డిజిటల్ రంగ రూపురేఖలను సమూలంగా మార్చనున్నాయని 'న్యూయార్క్ టైమ్స్' తన కథనంలో వెల్లడించింది.**

మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ వ్యాపార వ్యూహాలు | డేటా నిల్వ నిబంధనలు, డిజిటల్ వృద్ధే పెట్టుబడులు | భారత్ లో డాలర్లు కుమ్మరిస్తున్న అమెరికా

## పోటెత్తిన పెట్టుబడులు

ఏఐ, డేటా సెంటర్లపై $ 67.5 బిలియన్లు



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

మైక్రోసాఫ్ట్ సంస్థ భారత్ లో ఏఐ ప్రాజెక్టుల కోసం 17.5 బిలియన్ డాలర్లను కేటాయించింది. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా ఏఐ ఆధారిత కార్యక్రమాల కోసం 35 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు అమెజాన్ వెల్లడించింది. గూగుల్ సంస్థ భారతీయ దిగ్గజాలైన అదానీ గ్రూప్, భారతీ ఎయిర్‌టెల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని డేటా సెంటర్ల ఏర్పాటుకు 15 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది. గూగుల్ ప్రతిపాదిత కేంద్రానికి సమీపంలోనే, మెటా కూడా భారీ డేటా సెంటర్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఇతర భారతీయ పారిశ్రామిక సంస్థల ప్రాజెక్టులు వీటికి అనుబంధంగా కొనసాగుతున్నాయి. మొత్తం కలిపి ఈ పెట్టుబడుల విలువ 67.5 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.5.6 లక్షల కోట్లకు చేరుకున్నట్లు అంచనా.

...::: తరువాయి 3వ పేజీలో..

## ఐఏఎస్ కావాలనుకున్నా... కానీ, నన్ను సీఎంను చేశారు!



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

''నన్ను చాలామంది ఐఏఎస్ అధికారి కావాలని సూచించారు. కానీ, నాకు చిన్నతనం నుంచే ప్రజాసేవపై ఆసక్తి ఉండటంతో రాజకీయాల వైపు అడుగులు వేశానని,'' ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో శనివారం జరిగిన ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలకు చంద్రబాబు నాయుడు తన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకంగా సాగింది.తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను చంద్రబాబు ఈ వేదికపై పంచుకున్నారు. "యూనివర్సిటీ నుంచే ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాను. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం నా అదృష్టం," అని ఆయన పేర్కొన్నారు.

...::: తరువాయి 6వ పేజీలో..



## ఇండిగోపై డీజీసీఏ నివేదిక

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

ఇండిగో విమానాలు వరుసగా రద్దుకావటం, సాంకేతిక సమస్యలు తలెత్తటంపై డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ - సివిల్ ఏవియేషన్) నియమించిన ఉన్నత స్థాయి కమిటీ, తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో విమానయాన సంస్థల వైఫల్యాలను ఎత్తిచూపింది. ఇండిగో విమానాల రద్దుపై విచారణ కోసం నలుగురు సభ్యుల ప్రత్యేక కమిటీని, డీజీసీఏ ఏర్పాటు చేసింది. ఇందులో జాయింట్ డైరెక్టర్ జనరల్ సంజయ్ కె. బ్రహ్మణే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కెప్టెన్ కపిల్ మంగ్లిక్, కెప్టెన్ లోకేష్‌రాంపాల్ ఉన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు డీజీసీఏ సమర్పించిన, ఈ నివేదికలోని అంశాలు ప్రస్తుతానికయితే, బహిర్గతం కాలేదు. భారతదేశంలో అతిపెద్ద ఎయిర్‌లైన్ అయిన ఇండిగో, ఈ నెలలో భారీ షెడ్యూల్ సంక్షోభాన్ని ఎదుర్కొంది. దీని కారణంగా వేలాది విమానాలు రద్దయ్యాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా విమానాశ్రయాలలో లక్షల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. గందరగోళం నెలకొంది. ఇండిగో 60శాతం కంటే ఎక్కువ దేశీయ విమానయాన సంస్థలను కలిగి ఉంది, దీనివల్ల విమాన ప్రయాణంపై గణనీయమైన ప్రభావం పడింది.

## మీ సానుభూతి మాకొద్దు.. వెళ్లిపోండి!

- రాజధానిలో కేంద్ర మంత్రి పెమ్మసానికి చేదు అనుభవం
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: బాధితుడి కుమారుడు
- బురద గుంటల్లో ప్లాట్లా? మీరు కూడా అక్కడే ఉంటారా?




అమరావతి (ఏడీఎన్ఎన్) :

రాజధాని రైతుల త్యాగాలను అపహాస్యం చేస్తూ, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై మందడం గ్రామం అట్టుడికిపోయింది. త్రి సభ్య కమిటీ తీరుతో తీవ్ర మనస్తాపానికి గురై, గుండెపోటుతో మరణించిన రైతు దొండపాటి రాములు ఉదంతం రాజధానిలో చిచ్చురేపింది.రాములు భౌతికకాయానికి నివాళులర్పించేందుకు శనివారం వచ్చిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌లను రైతులు నిలదీసి ముచ్చెమటలు పట్టించారు.

...::: తరువాయి 6వ పేజీలో..

## అమెరికాలో తెలుగు విద్యార్థి అరెస్టు... ఇంటికే నిప్పు పెట్టబోయాడు



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

టెక్సాస్ యూనివర్శిటీ సీనియర్ విద్యార్థి మనోజ్ సాయి లేళ్ల(22)ను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. భారత సంతతికి చెందిన ఈ విద్యార్థి, తన తల్లిదండ్రులనే బెదిరించి హతమార్చే ప్రయత్నం చేశాడు. కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న మనోజ్ సాయి, ఈ నెల 22వ తేదీన తన ఉంటున్న ఇంటికే నిప్పు పెట్టే ప్రయత్నం చేశాడు. వెంటనే సమాచారం అందుకున్న, టెక్సాస్‌లోని ఫ్రిస్కో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మనోజ్ తమను తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఇంతకు ముందు కూడా ఇంటికి నిప్పు పెట్టేందుకు కూడా ప్రయత్నించాడని, అతడి తల్లిదండ్రులు పోలీసుల వద్ద వాపోయారు. అతనిపై రెండు ప్రధాన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ సెక్షన్ల కింద అతనికి, 5 ఏళ్ల నుంచి 99 ఏళ్ల వరకు లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మనోజ్ కొల్లిన్ కౌంటీ జైలులో ఉన్నాడు. ఇంటికి నిప్పు పెట్టినందుకు గాను లక్ష డాలర్లు, బెదిరింపుల కేసులో 3,500 డాలర్ల చొప్పున కోర్టు బాండ్ మొత్తాన్ని నిర్ణయించింది.



తప్పించుకున్న సినీ నటి సోదరుడు

## డ్రగ్స్ ముఠాల గుట్టురట్టు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలను ఆసరాగా చేసుకుని మత్తు పదార్థాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. 'ఈగల్ టీమ్' పేరుతో ప్రత్యేక బృందాలు నగరాన్ని జల్లెడ పడుతూ డ్రగ్స్ నెట్‌వర్క్ లను ఛేదిస్తున్నాయి. వారం క్రితం మాసబ్ ట్యాంక్ వద్ద పట్టుబడ్డ భారీ డ్రగ్స్ ముఠా విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముంబై నుంచి మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుని నైజీరియన్ మహిళల సహకారంతో విక్రయిస్తున్న ఈ ముఠాలో, ఒక ప్రముఖ సినీ నటి సోదరుడు కూడా భాగస్వామిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, అతని ఆచూకి తెలియటం లేదు. సైబరాబాద్ మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో మెరుపు దాడులు నిర్వహించారు. ఒక ప్రైవేట్ పాఠశాల సమీపంలో రహస్యంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మల్లారెడ్డి ఆసుపత్రిలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు, ముగ్గురు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు ఉండటం కలకలం రేపుతోంది. వీరి నుంచి రూ. 4 లక్షల విలువైన 70 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, రెండు కార్లు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేసి, న్యూ ఇయర్ వేడుకల కోసం పార్టీలకు సరఫరా చేసేందుకు వీరు ప్రణాళిక రచించినట్లు పోలీసులు నిర్ధారించారు.

86

## వందేళ్ల... ఆర్ఎస్ఎస్ భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

### మేం వేరు కాదు... మీలో ఒకరం సంఘ్ - సమాజం అద్వైత సిద్ధి

సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే ఇచ్చిన చారిత్రక దిశానిర్దేశం



1925లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) ప్రారంభమైనప్పుడు, దాని లక్ష్యం హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం. అప్పట్లో సమాజం వేరు, సంఘ్ వేరు. కొందరు మాత్రమే యూనిఫామ్ వేసుకుని శాఖకు వచ్చేవారు. కానీ, 2025 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే గారు ఒక విప్లవాత్మకమైన ప్రకటన చేశారు: "ఇకపై సంఘ్ సమాజంలో ఒక సంస్థగా (Organization IN Society) ఉండకూడదు. సంఘమే సమాజ రూపం దాల్చాలి (Organization OF Society). పాలల్లో పంచదార ఎలా కలిసిపోయి తీపిని ఇస్తుందో, స్వయంసేవకులు సమాజంలో అలా కలిసిపోయి సంస్కారాన్ని ఇవ్వాలి." ఇది కేవలం మాటల గారడీ కాదు. ఇది సంఘ్ పనితీరులో వస్తున్న "మౌలిక మార్పు" (Paradigm Shift). గతంలో "శాఖకు రండి" అని పిలిచేవారు. ఇప్పుడు "మేమే మీ ఇంటికి, మీ వాడకు వస్తాం" అంటున్నారు. ఎందుకు? ఎందుకంటే, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు (కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం, పర్యావరణం, సామాజిక అసమానతలు) కేవలం ఒక గంట శాఖతో పరిష్కారం కావు. స్వయంసేవకుడు 24 గంటలూ సమాజంలో మమేకమైతేనే పరిష్కారం దొరుకుతుంది. ఇందులో, సర్ కార్యవాహ పిలుపు వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని, "పంచ పరివర్తన" ద్వారా జనంలోకి వెళ్లే విధానాన్ని కూలంకషంగా విశ్లేషించుకుందాం.

...::: తరువాయి 2వ పేజీలో..




## ఉపాధి హామీ బచావో ఉద్యమానికి సై

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

కేంద్ర ప్రభుత్వం 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' రద్దు చేయడాన్ని నిరసిస్తూ వచ్చే నెల 5 నుంచి దేశవ్యాప్తంగా 'ఉపాధి హామీ బచావో' ఉద్యమాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్ణయించింది. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన శనివారం జరిగిన ఈ సమావేశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా ఇతర అగ్రనేతలు పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. పేదవాడి ఆకలి తీర్చడంతో పాటు పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నాటి యూపీఏ ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని తెచ్చిందని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయడం ద్వారా పేదల పొట్ట కొడుతోందని, ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహాత్ముడి పేరుతో ఉన్న ఈ చారిత్రక పథకాన్ని కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టం వల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పడటమే కాకుండా, పేదలకు ఉపాధి హక్కు కనుమరుగవుతుందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

## సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలపై ఆ సంస్థ డైరెక్టర్ గౌతమ్‌ను హరీశ్ రావు శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలైన డిస్కాంలు, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.42 వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా, సంస్థను ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఈ బకాయిలు చెల్లించకపోతే కార్మికుల జీతాలు, సంక్షేమ పథకాలపై ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు తమ హక్కుల కోసం ఇబ్బందులు పడుతుంటే, సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి నిధులతో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడిస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెస్సీ ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం రూ.100 కోట్ల సింగరేణి నిధులను మళ్లించారని ఆరోపించారు. బోనస్ విషయంలోనూ కార్మికులకు అన్యాయం జరిగిందని.. రూ.6,394 కోట్ల నికర లాభం వస్తే, కేవలం రూ.2,360 కోట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని 34 శాతం బోనస్ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఈ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపుతామని హెచ్చరించారు. అక్రెడిటేషన్ కార్డుల కోసం ఆందోళన చేస్తున్న డెస్క్ జర్నలిస్టులను అరెస్టు చేయించడం ప్రజాస్వామ్యంలో దుర్మార్గమైన చర్య అని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 26 వేల కార్డులు ఇస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంఖ్యను 10 వేలకు తగ్గించిందని విమర్శించారు. జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో నెం.252ను వెంటనే సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
ఆదివారం | హైదరాబాద్
28.12.2025
www.manasarkar.com

# మేం వేరు కాదు... మీలో ఒకరం
# సంఘ్ - సమాజం అద్వైత సిద్ధి



**మొదటిపేజీ తరువాయి...**

తాత్విక మార్పు 'మేము' నుంచి 'మనం' వైపు: సరిహద్దులు చెరిగిపోతున్న శుభ తరుణం

గడిచిన 99 ఏళ్లుగా సమాజంలో ఒక అలిఖిత భావన ఉంది: "ఖాకీ నిక్కర్ (ఇప్పుడు ప్యాంట్) వేసుకుని, చేతిలో దండ పట్టుకుని, మైదానంలో కవాతు చేసేవారే ఆర్ఎస్ఎస్ వాళ్లు". అంటే, యూనిఫామ్ వేసుకున్న వారు "మేము" (సంఘ్), యూనిఫామ్ వేసుకోని వారు "మీరు" (మిగిలిన సమాజం).

కానీ, సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలే గారు ఈ విభజన రేఖను పూర్తిగా తుడిచివేశారు. "సంఘ్ ఒక ద్వీపం (Island) లాగా ఉండకూడదు, అది సముద్రంలో కలిసిన నీటి బొట్టులా ఉండాలి" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ తాత్విక మార్పును మూడు లోతైన కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. పాలల్లో పంచదార సిద్ధాంతం (The Sugar in Milk Philosophy)**

దీనిని హొసబలే గారు చాలా చక్కగా వర్ణించారు. పాలలో పంచదార కలిపినప్పుడు ఏమవుతుంది?

- **పంచదార** తన రూపాన్ని (Identity) కోల్పోతుంది, కానీ పాలకు తీపిని (Quality) ఇస్తుంది.
- **ఇకపై** స్వయంసేవకులు కూడా అలాగే ఉండాలి.
  - **"నేను** ఆర్ఎస్ఎస్ లీడర్ని" అని జెండా పట్టుకుని తిరగడం ముఖ్యం కాదు.
  - **సమాజంలో** ఒక సామాన్యుడిగా కలిసిపోయి, ఆ సమాజానికి క్రమశిక్షణను, దేశభక్తిని (తీపిని) పంచడమే ముఖ్యం.
- **సంస్థ కనిపించకూడదు,** సంస్థ ప్రభావం (Impact) మాత్రమే కనిపించాలి. ఈ "అహంకార రాహిత్యమే" (Selfeffacement) కొత్త సంఘ్ తత్వం.

**2. 'సజ్జన శక్తి'కి ద్వారాలు బార్లా.. (Embracing the Goodness Force)**

ఇంతకాలం శాఖకు రానివారిని సంఘ్ పెద్దగా పట్టించుకునేది కాదు. కానీ సమాజంలో కోట్లాది మంది "మంచివారు" (Sajjan Shakti) ఉన్నారు.

- **వారు** డాక్టర్లు కావచ్చు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావచ్చు, లేదా ఒక చిన్న కిరాణా కొట్టు యజమాని కావచ్చు. వారికి దేశం కోసం ఏదో చేయాలని ఉంటుంది, కానీ రోజువారీ శాఖకు వెళ్లే సమయం ఉండదు.
- **హొసబలే వ్యూహం:** "మీరు శాఖకు రాకపోయినా పర్లేదు, మీరు ఉన్న చోట నుంచే దేశానికి సేవ చేయండి, మేము మిమ్మల్ని మా వాళ్ళుగానే (స్వయంసేవకులుగానే) భావిస్తాం."
- **ఈ ఒక్క** నిర్ణయంతో, సంఘ్ పరిధి (Scope) లక్షల నుంచి కోట్లకు పెరిగింది. ఇది "మేము" (Exclusive) అనే సంకుచితత్వం నుంచి "మనం" (Inclusive) అనే విశాలత్వానికి జరిగిన ప్రయాణం.

**3. ఆర్గనైజేషన్ 'ఇన్' సొసైటీ vs ఆర్గనైజేషన్ 'ఆఫ్' సొసైటీ**

ఇది అత్యంత కీలకమైన తాత్విక అంశం.

- **గతంలో:** సంఘ్ "సమాజంలో ఒక సంస్థ" (Organization IN Society) గా ఉండేది. అంటే రోటరీ క్లబ్ లాగానో, లయన్స్ క్లబ్ లాగానో ఇదొక గ్రూప్.
- **భవిష్యత్తు:** ఇకపై సంఘ్ "సమాజమే ఒక సంస్థ" (Organization OF Society) గా మారాలి.
  - **అంటే,** విపత్తు వచ్చినప్పుడు కేవలం ఆర్ఎస్ఎస్ వాళ్ళే సహాయం చేయడం కాదు; ఆర్ఎస్ఎస్ స్ఫూర్తితో మొత్తం సమాజం కదిలి రావాలి.
  - **ప్రతి** పౌరుడు ఒక స్వయంసేవకుడిలా క్రమశిక్షణతో ఉండాలి.
  - **సంఘ్** కరిగిపోయి సమాజంగా మారాలి. అప్పుడు "సంఘ్ వేరు సమాజం వేరు" అనే ప్రశ్నే ఉండదు. అంతా "మనమే".

ఈ తాత్విక మార్పు వల్ల ఏం జరుగుతోంది?
సంఘ్ కార్యాలయాల చుట్టూ ఉన్న గోడలు కూలిపోతున్నాయి.
ఇప్పుడు కాషాయ జెండా కేవలం కార్యాలయం మీద మాత్రమే కాదు, ప్రజల మనసుల్లో ఎగురుతోంది.
"శాఖ" అనేది ఒక ఫిజికల్ లొకేషన్ (Physical Location) కాదు, అదొక "మానసిక స్థితి" (State of Mind) అని హొసబలే గారు నిర్వచించారు.
మీరు ఎక్కడున్నా ధర్మం కోసం నిలబడితే... "మీరే సంఘ్, సంఘే మీరు". ఇదే ఆ అద్వైత స్థితి.

**పంచ పరివర్తన – జనంలోకి వెళ్ళడానికి 'ఐదు రాజమార్గాలు'**

ఒకప్పుడు దేశభక్తి అంటే సరిహద్దులో నిలబడటం లేదా జైలుకు వెళ్లడం. కానీ నేటి కాలంలో దేశభక్తి నిర్వచనం మారింది. దత్తాత్రేయ హొసబలే గారి ప్రకారం "సమాజంలోని లోపాలను సరిదిద్దడమే నిజమైన దేశభక్తి". ఇందుకోసం ఆయన ఐదు అస్త్రాలను (Five Weapons) స్వయంసేవకులకు అందించారు.

**1. సామాజిక సమరసత (Social Harmony) - హృదయాలను కలిపే వారధి**

భారతీయ సమాజానికి పట్టిన అతిపెద్ద చీడపురుగు 'కుల వివక్ష'. ఇది ఉన్నంత కాలం హిందూ సమాజం ఏకం కాలేదు.

- **ఆచరణ:** కేవలం ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. స్వయంసేవకులు ఇప్పుడు దళిత బస్తీలకు వెళ్తున్నారు. అక్కడ "సహపంక్తి భోజనాలు" (Dining together) చేస్తున్నారు.
- **దేవాలయ ప్రవేశం:** "దేవుడి ముందు అందరూ సమానమే" అనే సిద్ధాంతంతో, కొన్ని గ్రామాల్లో దళితులను ఆలయాల్లోకి అనుమతించని చోట, సంఘ్ చొరవ తీసుకుని అందరినీ కలుపుకుని పూజలు నిర్వహిస్తోంది.
- **సందేశం:** "హిందవః సోదరా సర్వే" (హిందువులందరూ సోదరులే). ఈ సందేశం ద్వారా అట్టడుగు వర్గాలకు సంఘ్ దగ్గరవుతోంది.

**2. కుటుంబ ప్రబోధన (Family Awakening) - ఇంటిని గుడిగా మార్చే ప్రయత్నం**

నేడు సమాజంలో విడాకులు, వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. పాశ్చాత్య "వెస్ట్" (West) గాలికి భారతీయ "నెస్ట్" (Nest/Home) చెదిరిపోతోంది.

- **కుటుంబ మిలన్:** దీనికి పరిష్కారంగా సంఘ్ "కుటుంబ మిలన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. స్వయంసేవకులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడతారు.
- **వారానికి ఒక గంట:** "వారానికి కనీసం ఒకసారైనా కుటుంబం అంతా కలిసి కూర్చుని భోజనం చేయాలి. ఆ సమయంలో టీవీలు, మొబైల్స్ ఆఫ్ చేయాలి. మన తాతల నాటి కథలు, మన సంస్కృతి గురించి మాట్లాడుకోవాలి" అని ప్రచారం చేస్తున్నారు.
- **ఇది సంఘ్‌ను** ప్రతి ఇంటి 'డ్రాయింగ్ రూమ్' వరకు తీసుకువెళుతోంది.

**3. పర్యావరణ పరిరక్షణ (Environmental Protection) - ప్రకృతి దేవోభవ**

పర్యావరణం అనేది ఇప్పుడు ఒక ఫ్యాషన్ కాదు, అది మన మనుగడ ప్రశ్న.

- **గ్రీన్ వారియర్స్:** స్వయంసేవకులు ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఉత్సవాల్లో (గణేష్ చతుర్థి వంటివి) మట్టి విగ్రహాలనే వాడాలని ఇంటింటికీ వెళ్లి చెబుతున్నారు.
- **నీటి పొదుపు:** నీటిని ఎలా పొదుపు చేయాలి, చెట్లను ఎలా పెంచాలి అనే దానిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. "ప్రకృతిని కాపాడితేనే, ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అనే వేద వాక్కును గుర్తుచేస్తున్నారు.

**4. స్వదేశీ ఆచరణ (Swadeshi Lifestyle) - ఆర్థిక దేశభక్తి**

స్వదేశీ అంటే కేవలం విదేశీ వస్తువులను తగలబెట్టడం కాదు. మన దేశ ఉత్పత్తులను ప్రేమించడం.

- **లోకల్ టు గ్లోబల్:** దీపావళికి చైనా లైట్లు కాకుండా, మన ఊరి కుమ్మరి చేసిన మట్టి ప్రమిదలు కొనమని సంఘ్ కోరుతోంది. మనం ఖర్చు చేసే రూపాయి మన దేశపు పేదవాడికి చేరాలి.
- **స్వావలంబన:** విదేశీ బ్రాండ్ల మోజులో పడి మన సంపదను బయటకు పంపకూడదు. ఈ "ఆర్థిక దేశభక్తి" (Economic Nationalism) ని ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా, సంఘ్ వ్యాపార వర్గాలకు, సామాన్యులకు దగ్గరవుతోంది.

**5. పౌర ధర్మం (Civic Duty) - హక్కులు కాదు, బాధ్యతలు**

భారతీయులు హక్కుల కోసం పోరాడతారు, కానీ బాధ్యతలను మర్చిపోతారు.

- **క్రమశిక్షణ:** ట్రాఫిక్ రూల్స్ పాటించడం, పన్నులు సరిగ్గా కట్టడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకపోవడం, ఓటు హక్కు వినియోగించుకోవడం. ఇవన్నీ దేశభక్తిలో భాగమే.
- **చైతన్యం:** స్వయంసేవకులు ప్రజలకు వారి బాధ్యతలను గుర్తుచేస్తున్నారు. "మంచి పౌరుడే మంచి దేశాన్ని నిర్మిస్తాడు" అని చాటిచెబుతున్నారు.

ఈ "పంచ పరివర్తన" కార్యక్రమం ద్వారా సంఘ్...
గుడి నుంచి బడి వరకు,
వంటింటి నుంచి పార్లమెంటు వరకు,
**చేను నుంచి ఫ్యాక్టరీ వరకు...**
ప్రతి చోట "మనం" అనే భావనతో విస్తరిస్తోంది.
జనంలోకి వెళ్ళడానికి ఇంతకంటే గొప్ప దారులు ఏముంటాయి? అందుకే హొసబలే గారి ఈ ప్రణాళికను "సామాజిక విప్లవ పత్రం" అని మేధావులు అభివర్ణిస్తున్నారు.

**మహిళా శక్తి - మాతృశక్తికి పెద్దపీట: 'అమ్మ' లేనిదే సమాజం లేదు**

సాధారణంగా బయట ప్రపంచానికి ఉండే ఒక పెద్ద అపోహ ఏమిటంటే "ఆర్ఎస్ఎస్ అంటే కేవలం మగవాళ్లదే, అక్కడ స్త్రీలకు స్థానం లేదు" అని. సాంకేతికంగా సంఘ్ శాఖలు పురుషుల కోసమే అయినప్పటికీ (మహిళల కోసం ప్రత్యేకంగా 'రాష్ట్ర సేవికా సమితి' ఉంది), సంఘ్ చేపట్టే విశాలమైన సామాజిక కార్యంలో స్త్రీలదే కీలక పాత్ర అని దత్తాత్రేయ హొసబలే గుర్తించారు.
"పక్షి ఎగరాలంటే రెండు రెక్కలు (స్త్రీ, పురుషులు) సమానంగా ఉండాలి" అనే స్వామి వివేకానందుడి మాటను హొసబలే గారు ఆచరణలోకి తెస్తున్నారు.
దీనిని నాలుగు ప్రధాన కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. సంస్కారానికి కేంద్ర బిందువు - గృహలక్ష్మి (Custodian of Values)**

సంఘ్ ఇప్పుడు "కుటుంబ ప్రబోధన" (Family Awakening) కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఒక కుటుంబంలో పిల్లలకు నీతి నిజాయితీలు, దేశభక్తి, సంస్కారం నేర్పించేది తండ్రి కంటే ఎక్కువగా తల్లే.

- **వ్యూహం:** "మేము పురుషులమైన స్వయంసేవకులం బయట ఎంత ప్రచారం చేసినా, ఇంట్లో అమ్మ మనసు మారకపోతే ఆ ఇల్లు మారదు."
- **అందుకే,** సంఘ్ ఇప్పుడు నేరుగా "మాతృశక్తి"ని సంప్రదిస్తోంది. "మీ పిల్లలను దేశభక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత మీదే (జిజియా బాయి శివాజీని తయారుచేసినట్లు)" అని వారికి గుర్తుచేస్తోంది. ఇల్లు ఒక పాఠశాల అయితే, అమ్మే ప్రధానోపాధ్యాయురాలు.

**2. మేధో రంగంలో మహిళా నాయకత్వం (Intellectual Leadership)**

ఇంతకాలం స్త్రీలను కేవలం వంటింటికే పరిమితం చేసే ఆలోచనలు ఉండేవి. కానీ హొసబలే గారి "జనంలోకి వెళ్లే" ప్రణాళికలో మహిళా మేధావులకు పెద్దపీట వేస్తున్నారు.

- **మహిళా సమ్మేళనాలు:** దేశవ్యాప్తంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో భారీ మహిళా సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వంటల పోటీలు ఉండవు; జాతీయ భద్రత, సామాజిక సమస్యలు, భారతీయ సంస్కృతి వంటి గంభీరమైన అంశాలపై చర్చలు జరుగుతాయి.
- **నిర్ణయాధికారం:** డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, రచయిత్రులుగా ఉన్న మహిళలను సంఘ్ అనుబంధ సంస్థల్లో కీలక బాధ్యతల్లోకి తీసుకుంటున్నారు. వారి ఆలోచనలను సంఘ్ విధాన నిర్ణయాల్లో (Policy Making) పరిగణనలోకి తీసుకుంటున్నారు.

**3. సామాజిక మార్పుకు చోదక శక్తి (Driving Force of Social Change)**

హొసబలే గారు రూపొందించిన "పంచ పరివర్తన"లో ఐదు అంశాలు విజయవంతం కావాలంటే స్త్రీల పాత్రే కీలకం.

- **పర్యావరణం:** ప్లాస్టిక్ వాడకూడదని ఇంట్లో అమ్మ నిర్ణయించుకుంటే, ఆ ఇల్లు మొత్తం ప్లాస్టిక్ రహితం అవుతుంది.
- **స్వదేశీ:** విదేశీ వస్తువులు కొనకూడదని గృహిణి అనుకుంటే, చైనా వస్తువులు ఆ ఇంట్లోకి రావు.
- **సమరసత:** ఇంట్లో పనిమనిషితో (దళిత/వెనుకబడిన వర్గాల వారు) ఆత్మీయంగా మాట్లాడటం, వారిని గౌరవించడం అనేది ఒక గృహిణి నుంచే మొదలవ్వాలి.

అందుకే, సంఘ్ ఇప్పుడు పురుషుల కంటే ఎక్కువగా స్త్రీలనే "ఏజెంట్స్ ఆఫ్ చేంజ్" (Agents of Change) గా చూస్తోంది.

**4. పాశ్చాత్య ఫెమినిజం vs భారతీయ మాతృశక్తి**
**ఇక్కడ ఒక తాత్విక స్పష్టత ఉంది.**

- **పాశ్చాత్య వాదం:** స్త్రీ, పురుషులు వేరు వేరు. స్త్రీ పురుషుడితో పోటీ పడాలి, పోరాడాలి.
- **సంఘ్ వాదం:** స్త్రీ, పురుషులు ఒకే బండికి ఉన్న రెండు చక్రాలు. ఒకరు ఎక్కువ కాదు, ఒకరు తక్కువ కాదు (అర్ధనారీశ్వర తత్వం). వారు ఒకరికొకరు సహకరించుకోవాలి.
- **హొసబలే గారు** ఈ "సమన్వయ వాదాన్ని" ప్రచారం చేస్తున్నారు. స్త్రీని గౌరవించడం అంటే ఆమెను పూజించడం మాత్రమే కాదు, ఆమెను "సశక్తీకరణ" (Empowerment) చేయడం అని చాటిచెబుతున్నారు.

ఈరోజు సంఘ్ పిలుపు మేరకు, యూనిఫామ్ వేసుకోని లక్షలాది మంది మహిళలు "సేవా భారతి" ద్వారా, "కుటుంబ ప్రబోధన" ద్వారా దేశ సేవలో పాల్గొంటున్నారు.
"శివాజీని కన్న జిజియా బాయి లేకపోతే హిందూ సామ్రాజ్యం లేదు."
అలాగే, నేటి మాతృశక్తి జాగృతం కాకపోతే "విశ్వగురు భారత్" సాధ్యం కాదు.
ఈ సత్యాన్ని గుర్తించిన సర్ కార్యవాహ, మహిళా శక్తికి సంఘ్ అజెండాలో అగ్రతాంబూలం ఇచ్చారు.

**సేవయే సాధనం - మాటలు కాదు, చేతలు: హృదయాలను గెలిచే 'నిశ్శబ్ద భాష'**

ప్రపంచంలో ఏ సంస్థకైనా ఒక కరపత్రం (Brochure) లేదా మేనిఫెస్టో ఉంటుంది. కానీ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) కు నిజమైన మేనిఫెస్టో దాని "సేవా కార్యకలాపాలే".
దత్తాత్రేయ హొసబలే గారు ఇచ్చిన "జనంలోకి వెళ్లాలి" అనే పిలుపుకు అత్యంత శక్తివంతమైన వాహనం 'సేవ'. ఎందుకంటే, కష్టంలో ఉన్నవాడికి సిద్ధాంతాలు అక్కర్లేదు, సాయం చేసే చేయి కావాలి. ఆ చేయే స్వయంసేవకుడు.
ఈ సేవా దృక్పథాన్ని నాలుగు కీలక కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. దయ కాదు... బాధ్యత (Duty, not Charity)**

ఇది చాలా ముఖ్యమైన తాత్విక వ్యత్యాసం. సాధారణంగా ఎన్జీవోలు (NGOs) సేవను "చారిటీ" (దానం/దయ) గా చేస్తాయి. "మేము ఇస్తున్నాం, మీరు తీసుకుంటున్నారు" అనే భావన అందులో ఉంటుంది.

- **హొసబలే సిద్ధాంతం:** "మనం సమాజానికి సేవ చేయడం అంటే ఎవరికో ఉపకారం చేయడం కాదు. సమాజం అనే దేవుడికి మన రుణం తీర్చుకోవడం."
- **నర సేవే నారాయణ సేవ:** తోటి మనిషిలో దైవాన్ని చూస్తూ సేవ చేయాలి. అప్పుడు తీసుకునేవాడి కంటే, ఇచ్చేవాడే (సేవకుడే) ఎక్కువ ధన్యుడు అవుతాడు. ఈ వినయమే సంఘ్ సేవా కార్యక్రమాల ప్రత్యేకత.

**2. ఆపద్బాంధవుడు - విపత్తుల వేళ మొదటి స్పందన (First Responders)**

దేశంలో ఎక్కడ భూకంపం వచ్చినా, వరదలు వచ్చినా, రైలు ప్రమాదాలు జరిగినా... ప్రభుత్వం కంటే ముందు అక్కడ కనిపించేది "కాషాయ కండువా" వేసుకున్న స్వయంసేవకులే.

- **కోవిడ్ అనుభవం:** కరోనా సమయంలో సొంత బంధువులే శవాలను ముట్టుకోవడానికి భయపడినప్పుడు, స్వయంసేవకులు ఆ అనాథ శవాలకు అంత్యక్రియలు చేశారు. ఆకలితో ఉన్న వలస కూలీలకు అన్నం పెట్టారు.
- **ఇది చూసిన తర్వాత,** సంఘ్‌ను విమర్శించేవారు కూడా మౌనంగా నమస్కరించారు. "సంఘ్ సమాజం ఒక్కటే" అని చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ అక్కర్లేదు.

**3. శాశ్వత ప్రాజెక్టులు - అడవి బిడ్డలకు అండగా (Sustainable Development)**

సేవ అంటే కేవలం ఆపద వచ్చినప్పుడు బియ్యం పంచడం మాత్రమే కాదు. తరతరాలుగా వెనుకబడిన వారి జీవితాల్లో వెలుగు నింపడం.

- **వనవాసి కల్యాణ్ ఆశ్రమం:** అడవిలో ఉండే గిరిజనులకు వైద్యం అందదు, చదువు ఉండదు. సంఘ్ వారి కోసం 1.5 లక్షలకు పైగా సేవా పథకాలను నడుపుతోంది.
- **ఏకలవ్య పాఠశాలలు:** స్కూలు లేని మారుమూల గిరిజన తండాల్లో, ఒకే ఉపాధ్యాయుడు నడిపే బడులు (Ekal Vidyalayas) నేడు లక్షలాది మంది గిరిజన పిల్లలను ఐఏఎస్‌లు, డాక్టర్లుగా మారుస్తున్నాయి.
- **"మాటలతో కాదు,** మా చేతలతో గిరిజనులను హిందూ సమాజంలో అంతర్భాగంగా ఉంచుతున్నాం" అని హొసబలే గారు గర్వంగా చెబుతారు. మత మార్పిడులకు అసలైన విరుగుడు ఈ సేవే.

4. సామాజిక అంతరాల తొలగింపు (Bridging Social Gaps)

సేవకు కులం లేదు, మతం లేదు.

- **ఒక** అగ్రవర్ణ స్వయంసేవకుడు, ఆసుపత్రిలో ఉన్న ఒక దళిత రోగికి రక్తం ఇచ్చినప్పుడు... అక్కడ కులం కరిగిపోతుంది, మానవత్వం గెలుస్తుంది.
- **బస్తీల్లో** పేద పిల్లలకు ట్యూషన్ చెప్పేటప్పుడు, ఆ పిల్లలు ఆ స్వయంసేవకుడిని "అన్నయ్యా" అని పిలుస్తారు. ఆ పిలుపులో ఆత్మీయత ఉంటుంది.
- **ఈ "సేవా బంధం"** ద్వారానే సంఘ్ సమాజంలోని అన్ని వర్గాలను ఒకే త్రాటిపైకి (Unity) తెస్తోంది.

దత్తాత్రేయ హొసబలే గారి ప్రకారం...
"సేవ అనేది సంఘ్‌కు ఒక కార్యక్రమం (Activity) కాదు, అదొక స్వభావం (Nature)."
పువ్వుకు సువాసన ఎలా సహజమో, స్వయంసేవకుడికి సేవ అలా సహజం కావాలి.
ఎప్పుడైతే ప్రతి స్వయంసేవకుడు తన ఇంటి పక్కన ఉన్న కష్టాన్ని తన కష్టంగా భావిస్తాడో... అప్పుడు ఆటోమేటిక్‌గా "సంఘ్ సమాజం" వేరు వేరుగా ఉండవు. రెండూ కలిసిపోతాయి.
మాటలు గాలిలో కలిసిపోతాయి... కానీ చేసిన సేవ చరిత్రలో, జనం గుండెల్లో నిలిచిపోతుంది.
అందుకే... సేవయే సాధనం.

**మేధో వర్గంతో సంవాదం – మెదళ్లను మేల్కొలిపే 'బౌద్ధిక యజ్ఞం'**

దేశాన్ని నడిపించేది ప్రభుత్వాలే అయినా, ఆ ప్రభుత్వాలను మరియు సమాజపు ఆలోచనా ధోరణిని (Public Opinion) ప్రభావితం చేసేది మాత్రం "మేధావి వర్గం" (Intellectual Class). రచయితలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, కార్పొరేట్ సీఈఓలు... వీరంతా సమాజానికి "థింక్ ట్యాంక్" (Think Tank) లాంటి వారు.
ఇంతకాలం ఈ వర్గం సంఘ్‌కు దూరంగా ఉండేది, లేదా సంఘ్‌ను అనుమానంతో చూసేది. ఈ అంతరాన్ని (Gap) పూడ్చడానికి హొసబలే గారు అమలు చేస్తున్న "సంవాద" (Dialogue) ప్రక్రియను నాలుగు కీలక కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. మేధో అంటరానితనం రద్దు (Breaking Intellectual Untouchability)**

గతంలో "సెక్యులర్" ముసుగులో ఉన్న కొందరు మేధావులు, జాతీయవాద భావాలు ఉన్నవారిని అకాడమిక్ రంగం నుంచి, సాహిత్య వేదికల నుంచి దూరం పెట్టేవారు.

- **హొసబలే వ్యూహం:** "మనం మన భావాలను చెప్పుకోవడానికి భయపడకూడదు. అలాగే, మనల్ని వ్యతిరేకించే వారితో మాట్లాడటానికి వెనుకాడకూడదు."
- **ఓపెన్ డిబేట్స్:** సంఘ్ ఇప్పుడు మూసిన గదుల్లో కాకుండా, బహిరంగ వేదికల మీద చర్చిస్తోంది. లిటరేచర్ ఫెస్టివల్స్, యూనివర్సిటీ సెమినార్లలో సంఘ్ ప్రతినిధులు పాల్గొంటున్నారు.
- **"మీరు** మమ్మల్ని ద్వేషించినా పర్లేదు, కానీ ముందు మమ్మల్ని అర్థం చేసుకోండి" అనే ఈ పారదర్శక వైఖరి (Transparency), తటస్థ మేధావులను (Neutral Intellectuals) ఆకర్షిస్తోంది.

**2. ప్రొఫెషనల్ ఫోరమ్స్ - 'శాఖ'కు ప్రత్యామ్నాయం**

ఒక హైకోర్టు లాయరో, ఒక ఐటీ కంపెనీ వైస్ ప్రెసిడెంటో... ఉదయాన్నే నిక్కర్ వేసుకుని, కర్ర పట్టుకుని పార్కులో జరిగే శాఖకు రావడం సాధ్యం కాకపోవచ్చు. వారి స్థాయి, సమయం వేరు.

- **ప్రత్యేక వేదికలు:** వీరి కోసం సంఘ్ వివిధ అనుబంధ సంస్థల ద్వారా (ప్రజ్ఞా ప్రవాహ, అధివక్త పరిషత్, విజ్ఞాన భారతి) ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తోంది.
- **వీక్లీ మిలన్స్:** ఇవి ఏసీ కాన్ఫరెన్స్ హాల్స్‌లోనో, లేదా ఒకరి ఇంట్లోనో జరుగుతాయి. అక్కడ కసరత్తులు ఉండవు; కేవలం "బౌద్ధిక చర్చలు" (Intellectual Discussions) ఉంటాయి.
- **విదేశాంగ విధానం,** ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత వంటి అంశాలపై వీరు లోతుగా చర్చిస్తారు. తద్వారా తాము కూడా దేశ నిర్మాణంలో భాగస్వాములమయ్యామనే సంతృప్తి వారికి కలుగుతుంది.

**3. 'వినడం' నేర్చుకున్న సంఘ్ (The Art of Listening)**

ఇది చాలా ముఖ్యమైన మార్పు. గతంలో సంఘ్ అంటే "మేము చెప్పింది మీరు వినండి" అనే ధోరణి ఉండేదని ఒక అపవాదు ఉండేది.

- **కొత్త విధానం:** హొసబలే గారు "సంవాదం" అంటే టూవే ట్రాఫిక్ అని స్పష్టం చేశారు.
- **సంఘ్ నాయకులు** ఇప్పుడు డాక్టర్ల దగ్గరకు వెళ్లి "దేశ ఆరోగ్య విధానం ఎలా ఉండాలి? మీ సలహాలు ఏంటి?" అని అడుగుతున్నారు.
- **చార్టర్డ్** అకౌంటెంట్ల దగ్గరకు వెళ్లి "జీఎస్టీలో లోపాలు ఏంటి?" అని అడుగుతున్నారు.
- **ఎప్పుడైతే** సంఘ్ తమ సలహాలను స్వీకరిస్తోందో, అప్పుడు ఆ మేధావులకు సంఘ్ పట్ల గౌరవం పెరుగుతోంది. వారు తమ మేధస్సును దేశం కోసం ధారపోస్తున్నారు.

**4. విధాన నిర్ణయాల్లో ప్రభావం (Impact on Policy Making)**

ఈ మేధో మథనం కేవలం చర్చలకే పరిమితం కావడం లేదు. ఇది ప్రభుత్వ విధానాలను మారుస్తోంది.

- **కొత్త విద్యా విధానం (NEP 2020):** దీని రూపకల్పనలో వేలాది మంది జాతీయవాద విద్యావేత్తల (Professors & Teachers) పాత్ర ఉంది. వీరందరినీ ఒక వేదికపైకి తెచ్చింది సంఘ్ ప్రేరణే.
- **చరిత్ర పునరుద్ధరణ:** చరిత్రను వక్రీకరించారని బాధపడే బదులు, విక్రమ్ సంపత్, సంజీవ్ సన్యాల్ వంటి ఆధునిక చరిత్రకారులకు, మేధావులకు సంఘ్ ఒక ప్లాట్‌ఫాం (Platform) ఇస్తోంది. వారు డేటాతో సహా వాస్తవాలను సమాజం ముందు ఉంచుతున్నారు.

**మేధో వర్గంతో సంవాదం అంటే...**

సంఘ్ యొక్క "కార్యకర్త బలానికి" (Cadre Base), మేధావుల "జ్ఞాన బలాన్ని" (Knowledge Base) జోడించడం.
ఎప్పుడైతే "మాస్" (Masses సామాన్య జనం) మరియు "క్లాస్" (Classes మేధావి వర్గం) ఒకే జాతీయవాద భావజాలంతో కలుస్తారో... అప్పుడు ఆ దేశాన్ని ఆపడం ఎవరి వల్లా కాదు.
సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలే గారు చేస్తున్న "నిశ్శబ్ద బౌద్ధిక విప్లవం" ఇదే. ఇది 'బ్రెయిన్' (Brain) మరియు 'మజిల్' (Muscle) కలయిక.

**విశ్వగురు భారత్ వైపు పయనం – ప్రపంచానికి దిక్సూచిగా మన 'ధర్మ భూమి'**

"ఒక దేశం గొప్పది ఎప్పుడు అవుతుంది? ఆ దేశం దగ్గర అత్యధిక అణుబాంబులు ఉన్నప్పుడా? లేక అత్యధిక సంపద ఉన్నప్పుడా?"
కాదు.
ప్రపంచం కష్టాల్లో ఉన్నప్పుడు, పరిష్కారం చూపించగలిగే శక్తి ఉన్నప్పుడే ఆ దేశం 'విశ్వగురు' (World Leader/Guide) అవుతుంది.
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలే గారి పిలుపు సారాంశం ఇదే. సంఘ్ సమాజం ఏకమవ్వడం అనేది కేవలం అంతర్గత బలం కోసం మాత్రమే కాదు; అది భారత్ ప్రపంచ వేదికపై తన సముచిత స్థానాన్ని తిరిగి పొందడం కోసం.
ఈ మహా ప్రస్థానాన్ని నాలుగు కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. సూపర్ పవర్ కాదు... విశ్వగురు (Not a Superpower, but a Global Guide)**

అమెరికా, చైనా దేశాలు "సూపర్ పవర్స్" కావాలనుకుంటాయి. అంటే పెత్తనం (Dominance) చేయాలని కోరుకుంటాయి.

- **కానీ భారత్** 'విశ్వగురు' కావాలనుకుంటోంది. గురువు పెత్తనం చేయడు, దారి చూపిస్తాడు.
- **నేడు ప్రపంచం** తీవ్రమైన మానసిక ఒత్తిడి, కుటుంబ విచ్ఛిన్నం, మరియు పర్యావరణ విధ్వంసంతో అల్లాడుతోంది.
- **వీటికి పరిష్కారం** పాశ్చాత్య భౌతికవాదంలో లేదు. అది భారతీయ "సనాతన ధర్మం" లో ఉంది.
- **యోగా ద్వారా** ఆరోగ్యాన్ని, కుటుంబ వ్యవస్థ ద్వారా మానసిక ప్రశాంతతను, ప్రకృతి ఆరాధన ద్వారా పర్యావరణ పరిరక్షణను ప్రపంచానికి నేర్పించాల్సిన బాధ్యత భారత్‌పై ఉంది.

**2. 'స్వ' (Swa) - ఆత్మవిస్మృతి నుంచి ఆత్మవిశ్వాసం వైపు**

హొసబలే గారు తరచుగా ప్రస్తావించే అంశం "స్వ" (Selfhood).

- **ఇన్నేళ్లుగా** మనం పాశ్చాత్యులను అనుకరించాం (Copycats). వారిలా బట్టలు వేసుకుంటే, వారిలా ఆలోచిస్తే గొప్ప అనుకున్నాం.
- **కానీ ఇప్పుడు** "సంఘ్ సమాజం" ఒక్కటై, మన మూలాలను వెతుకుతున్నాయి.
- **మన భాష,** మన వేషం, మన ఆహారం, మన ఆలోచన... అన్నీ గొప్పవే అనే ఆత్మవిశ్వాసం (SelfConfidence) ప్రతి భారతీయుడిలో కలగాలి. ఎప్పుడైతే మనం మనలా ఉంటామో, అప్పుడే ప్రపంచం మనల్ని గౌరవిస్తుంది.

**3. 140 కోట్ల అడుగులు... ఒకే దిశలో (Collective March)**

ప్రధాని మోదీ గారు చెప్పినట్లు "140 కోట్ల మంది భారతీయులు ఒక్క అడుగు ముందుకు వేస్తే, దేశం 140 కోట్ల అడుగులు ముందుకు వెళ్తుంది."

- **సంఘ్** ఇప్పుడు చేస్తున్నది అదే. సమాజంలోని ప్రతి వ్యక్తిని (రైతు, కార్మికుడు, శాస్త్రవేత్త) ఈ యజ్ఞంలో భాగస్వామిని చేస్తోంది.
- **కేవలం** ప్రభుత్వం మారితే దేశం మారదు; "జనగణమన" (ప్రజల మనసు) మారితేనే దేశం మారుతుంది.
- **స్వయంసేవకులు** ఆ మార్పుకు వాహకాలుగా (Catalysts) పనిచేస్తున్నారు.

**4. కృణ్వంతో విశ్వమార్యం - అంతిమ లక్ష్యం**

సంఘ్ ప్రార్థనలో చివరగా కోరుకునేది భారత్ విజయం మాత్రమే కాదు.
"పరం వైభవం నేతుమే తత్ స్వరాష్ట్రం" (ఈ దేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకువెళ్ళాలి). ఎందుకు?
ప్రపంచ క్షేమం కోసం!

- **భారత్** బలహీనపడినప్పుడే ప్రపంచంలో యుద్ధాలు, అశాంతి పెరిగాయి. భారత్ బలపడితే ప్రపంచానికి శాంతి లభిస్తుంది.
- **"వసుధైక కుటుంబకమ్"** (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనను ఆచరణలో పెట్టగలిగే ఏకైక దేశం భారత్.

**చివరి మాట:**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల వేళ...
ఇది ఒక సంస్థ చేస్తున్న పండుగ కాదు. ఇది ఒక జాతి జరుపుకుంటున్న "ఆత్మగౌరవ మహోత్సవం".
సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలే గారు చూపించిన మార్గంలో...
సంఘ్ కరిగిపోవాలి... సమాజం గెలవాలి.
కాషాయ జెండా రెపరెపలు... ఇకపై కేవలం మైదానాల్లో కాదు, ప్రతి భారతీయుడి గుండెలో వినిపించాలి.
చీకటిని చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడిలా...
నిద్రలేచిన ఈ సమాజం, రేపటి ప్రపంచానికి వెలుగునిస్తుంది.
ఆ వెలుగు పేరే... భారత్.
జై హింద్! జై భారత్!

రచన: **భూక్యా గోపినాయక్**

**కాషాయ జెండా రెపరెపలు... ఇకపై కేవలం మైదానాల్లో కాదు,
ప్రతి భారతీయుడి గుండెలో వినిపించాలి.
చీకటిని చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడిలా...
నిద్రలేచిన ఈ సమాజం, రేపటి ప్రపంచానికి వెలుగునిస్తుంది.
ఆ వెలుగు పేరే... భారత్. జై హింద్! జై భారత్!**

## చరిత్ర సృష్టించిన దియా
## చిన్న వయసులో చైర్‌పర్సన్‌గా!



కేరళకు చెందిన దియా బిను పులిక్కకండమ్ రాజకీయాల్లో సరికొత్త రికార్డు సృష్టించారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో, పాలా మున్సిపాలిటీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఆమె, తాజాగా ఆ మున్సిపాలిటీకి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో దేశంలోనే ఈ పదవిని చేపట్టిన అతి పిన్న వయస్కురాలిగా నిలిచారు. కేరళ రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రాలేదు. ఎల్‌డీఎఫ్‌కు 12, యూడీఎఫ్‌కు 10 సీట్లు వచ్చాయి. 15వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన దియాతో పాటు, ఆమె తండ్రి, బాబాయ్ కూడా స్వతంత్రులుగా విజయం సాధించారు. పాలకమండలిలో 26 మంది సభ్యులు స్వతంత్రులే కింగ్ మేకర్స్ అయ్యారు. దియా కుటుంబం కాంగ్రెస్ (యూడీఎఫ్)కు మద్దతు తెలపడంతో, పొత్తులో భాగంగా ఆమెకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి దక్కింది. పాలా మున్సిపాలిటీలోని 15వ వార్డు నుంచి 21 ఏళ్ల దియా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, విజయం సాధించారు. ఆమె తండ్రి, బాబాయ్ కూడా ఈ ఎన్నికల్లో గెలుపొందారు. దీర్ఘకాలిక ప్రణాళికతో, మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనే తన మొదటి ప్రాధాన్యత అని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవి దక్కడంపై దియా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నా తండ్రి విజయం సాధించడం ఇది ఐదోసారి. ప్రజల కోసం ఆయన చేస్తోన్న సేవను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. అదే నాకు స్ఫూర్తి అని చెప్పారు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ నుంచి దియా ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. ఒక ప్రజానేతగా విధులు నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను అభ్యసిస్తానని చెప్పి, చదువుపై తనకున్న అభిరుచిని వ్యక్తం చేశారు. గతంలో కూడా స్థానిక సంస్థల విషయంలో కేరళ వార్తల్లో నిలిచింది. 2020లో తిరువనంతపురం మేయర్‌గా 21 ఏళ్ల ఆర్యా రాజేంద్రన్ ఎన్నికై దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఇప్పుడు దియా బిను అదే బాటలో నిలిచి చరిత్ర సృష్టించారు.

## పాక్‌తో జాగ్రత్త, కేంద్రాన్ని
## హెచ్చరించిన కాంగ్రెస్ నేత

పాకిస్థాన్ క్షిపణిలపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్ మారుస్తున్న సైనిక వ్యూహాలు, ముఖ్యంగా వారు అభివృద్ధి చేస్తున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థల పట్ల, భారత ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ భారత ప్రభుత్వాన్ని సూచించారు. ఒక వార్తా సంస్థకు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున,



ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టి సారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని, ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతోందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం, విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతోందని శశిథరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ, భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ, బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై కేంద్రప్రభుత్వాన్ని అప్రమత్తంగా ఉండాలని కోరుతూ పాక్ సైనిక వ్యూహాలపై శశిథరూర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## పాలకులను వణికించిన 'జెన్-జీ' శక్తి



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
ప్రపంచ రాజకీయాలను ఒక కుదుపుకుదిపిన శక్తిగా 'జెన్-జీ' యువత అవతరించింది. డిజిటల్ తెరల వెనక పెరిగిన ఈ తరం, ఈ ఏడాది తమ ఆవేశాన్ని వీధుల్లోకి తీసుకువచ్చింది. అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, ప్రభుత్వ వైఫల్యాలపై యువగళం విప్పింది. ఎన్నో దేశాల్లో ఉద్యమాలకు నేతృత్వం వహించి ప్రభుత్వాలను గద్దె దించడమే కాదు, వ్యవస్థలను ప్రశ్నించే స్థాయికి ఎదిగింది. 2025లో చోటుచేసుకున్న అనేక ప్రపంచ ఘటనల్లో జెన్-జీ ఆందోళనలు అందరి దృష్టిని ఆకర్షించాయి.ఆన్‌లైన్ ప్రపంచంలో పెరిగిన ఈ తరం, సోషల్ మీడియాను ఆయుధంగా మార్చుకుని సంఘటితమైంది. ఇంతకు ముందు ఎన్నడూ లేనంతగా ప్రభుత్వాల నిర్ణయాలను ప్రశ్నించింది. నేపాల్, మెక్సికో, మడగాస్కర్, మొరాకో వంటి దేశాల్లో చెలరేగిన జెన్-జీ నిరసనలు ఆయా దేశాల రాజకీయ వ్యవస్థల్లో మార్పులు తప్పవన్న సంకేతాలను ఇచ్చాయి.నేపాల్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించిన ప్రభుత్వ నిర్ణయం యువతను భగ్గుమనిపించింది. జెన్-జీ నేతృత్వంలో మొదలైన ఆందోళనలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. పరిస్థితి అదుపు తప్పడంతో దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలు చెలరేగాయి. ఈ ఉద్యమాల ప్రభావంతో ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేయాల్సి వచ్చింది. జెన్-జీ ఉద్యమం ప్రభుత్వాన్ని ఎంత వేగంగా కూల్చగలదో ప్రపంచానికి తెలియజేసిన ఘటనగా ఇది నిలిచింది. మడగాస్కర్‌లో విద్యుత్, నీటి సరఫరా అంతరాయాలపై యువత సెప్టెంబర్‌లో మొదలుపెట్టిన నిరసనలు అక్టోబర్ నాటికి పెను ఉద్యమంగా మారాయి. నిరసనకారులపై కాల్పులు జరపాలన్న ఆదేశాలను సైన్యం తిరస్కరించడంతో పరిస్థితి కీలక మలుపు తిరిగింది. చివరికి అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా దేశం విడిచి వెళ్లాల్సి వచ్చి, కల్నల్ మైఖేల్ అధికారాన్ని చేపట్టారు. మొరాకోలో ఆర్థిక మాంద్యం, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రజా సేవల వైఫల్యంపై యువత కన్నెర్ర చేసింది. 'జెన్-జీ 212' అనే బ్యానర్ కింద ఐక్యమైన యువత డిజిటల్ నెట్‌వర్క్ ల ద్వారా ఉద్యమాన్ని విస్తరించింది. మెక్సికోలో నవంబర్‌లో జరిగిన ఓ స్థానిక మేయర్ హత్య యువతను మరింత ఆగ్రహానికి గురి చేసింది. దేశంలో పెరుగుతున్న నేరాలు, అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది యువకులు వీధుల్లోకి వచ్చారు. ఈ ఆందోళనల్లో పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకుని పలువురు గాయపడ్డారు. జెన్-జీ నిరసనలకు దేశానుసారంగా కారణాలు వేర్వేరైనా, ఉద్యమ స్ఫూర్తి మాత్రం ఒకటే. ఆన్‌లైన్ టూల్స్, యాప్స్, హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా సమస్యలను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఈ తరం విజయం సాధించింది. ఇంటర్నెట్ నిలిపివేతలు, ఆంక్షలు ఎదురైనా వారు వెనకడుగు వేయలేదు. ఇప్పుడు ప్రపంచ దృష్టి భవిష్యత్తుపై ఉంది. 2026లో నేపాల్‌తో పాటు పలు దేశాల్లో కీలక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఉద్యమాల్లో ముందుండిన జెన్-జీ యువత తమ ఓటుతో రాజకీయాలను ఎలా మలుస్తుందోనన్న ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా నెలకొంది.

## పోటెత్తిన పెట్టుబడులు

**మొదటిపేజీ తరువాయి...**
ముంబైకి చెందిన ఏఎస్‌కే వెల్త్ అడ్వైజర్స్ చీఫ్ ఇన్వెస్ట్ మెంట్ ఆఫీసర్ సోమనాథ్ ముఖర్జీ మాట్లాడుతూ, భారత్‌లో ఒకే రంగంలో ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి కావచ్చని ఆయన తెలిపారు. భారత దేశ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, విస్తారమైన వినియోగదారుల బేస్‌పై ఈ కంపెనీలు భారీ ఆశలు పెట్టుకున్నాయి. ప్రపంచ డేటాలో దాదాపు 20 శాతం భారత్‌లోనే ఉత్పన్నమవుతున్నా, గ్లోబల్ డేటా స్టోరేజ్ సామర్థ్యంలో మన వాటా చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. విదేశీ సర్వర్లపై ఆధారాన్ని తగ్గించుకునే దిశగా డేటాను దేశంలోనే నిల్వ చేయాలనే నిబంధనలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. 2018 నుంచే ఈ దిశగా చట్టపరమైన మార్పులు ప్రతిపాదిస్తోంది. ఇప్పటికే బ్యాంకులు, మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు ఈ నిబంధనలు వర్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలు డేటా సెంటర్లకు కేంద్రాలుగా మారుతున్నాయి. విధానపరమైన ప్రోత్సాహకాలు, విద్యుత్, నీటి లభ్యత కారణంగా హైదరాబాద్ పెద్ద ప్రాజెక్టులను ఆకర్షిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం పోటీ నెలకొన్న తరుణంలో ఈ పెట్టుబడులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి.

## ఆర్ఎస్ఎస్, బీజేపీలపై డిగ్గీరాజా ప్రశంసలు

**మొదటిపేజీ తరువాయి...**
మోదీకి చెందిన పాత ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన తర్వాత, దాని మీద ఆయన చేసిన వ్యాఖ్యలతో మొత్తానికి జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించారు. ఇందులో బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ కుర్చీలో కూర్చొని ఉండగా, ఆయన ముందు నేలపై ప్రధాని మోదీ కూర్చొన్నట్లు ఉంది. నేలపై కూర్చొన్న వ్యక్తి దేశానికి ప్రధానిగా అయ్యారంటూ మోదీని ఉద్దేశిస్తూ, దిగ్విజయ్ కొనియాడారు. నేను ఓ ఫొటో చూశాను, ఇది చాలా ఆసక్తికరంగా ఉంది. ఆర్ఎస్ఎస్‌లో సామాన్య కార్యకర్తలా, నాయకుల పాదాల వద్ద నేలపై కూర్చొన్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి, ఇది ఆ సంస్థ శక్తి అని రాసుకొచ్చారు. ఈ పోస్టుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు రాహుల్, ప్రియాంక గాంధీలను ట్యాగ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, గత కొంతకాలంగా శశిథరూర్ మోదీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల మోదీకి కితాబిస్తూ థరూర్ చేసిన పోస్ట్ వైరల్ అయ్యింది. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని తనను అందరూ ఆరోపిస్తుంటారని మోదీ చెప్పారు. కానీ, ఆయన ప్రజల సమస్యల విషయంలో ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని థరూర్ తన పోస్ట్ లో రాసుకొచ్చారు.

## బంగ్లాలో రాక్‌స్టార్ పై దాడి

**మొదటిపేజీ తరువాయి...**



విభావరికి వచ్చిన వారిపై ఆందోళనకారులు రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ఘటనలో పాఠశాల విద్యార్థులు సహా దాదాపు 20 మంది వరకు గాయపడినట్లు సమాచారం.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా కాన్సర్ట్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆందోళనకారుల దాడి నుంచి గాయకుడు జేమ్స్ త్రుటిలో తప్పించుకున్నారు. ఉద్రిక్తతలు మొదలవగానే భద్రతా సిబ్బంది ఆయన్ను అక్కడి నుంచి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. జేమ్స్‌కు, ఆయన సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

# ఆయుధాల అమ్మకంపై అమెరికాకు వార్నింగ్



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
తైవాన్‌కు ఆయుధాలు విక్రయించాలన్న అమెరికా నిర్ణయంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. తైవాన్‌కు ఆయుధాల సరఫరా చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికాను చైనా హెచ్చరించింది. ఈ క్రమంలోనే తైవాన్‌కు గత కొన్నేళ్లుగా ఆయుధాల సరఫరాలో సహకరించిన 20 అమెరికా రక్షణ కంపెనీలు, 10 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్లపై ఆంక్షలు విధిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ ఆంక్షలు తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని గ్లోబల్ టైమ్స్ వార్త సంస్థ వెల్లడించింది.అమెరికా తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయడం 'వన్‌చైనా సిద్ధాంతం'కు, చైనా-అమెరికా సంయుక్త ఒప్పందాలకు పూర్తిగా విరుద్ధమని బీజింగ్ ఆరోపించింది. ఈ చర్యలు చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా అభివర్ణిస్తూ, దేశ సార్వభౌమాధికారాన్ని, భౌగోళిక సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని తెలిపింది. చైనా ఆంక్షలు విధించిన కంపెనీల జాబితాలో నార్త్‌రోప్ గ్రుమ్మన్, బోయింగ్ (సెయింట్ లూయిస్ విభాగం), ఎల్3 హారిస్ మ్యారిటైమ్ సర్వీసెస్, గిబ్స్ అండ్ కాక్స్, రెడ్ క్యాట్ హోల్డింగ్స్, టీల్ డ్రోన్స్ సహా మొత్తం 20 దిగ్గజ సంస్థలు ఉన్నాయి. ఈ కంపెనీలకు చైనాలో ఉన్న స్థిర, చరాస్తులన్నింటినీ స్తంభింపజేస్తున్నట్లు ప్రకటించింది. చైనా వ్యక్తులు, సంస్థలు ఈ కంపెనీలతో ఎలాంటి వ్యాపార ఒప్పందాలు చేసుకోరాదని నిషేధం విధించింది.తైవాన్‌కు ఆయుధాల సరఫరాలో కీలకంగా వ్యవహరించిన ఆండూరిల్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీతో పాటు, మరో 10 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంది. వీరు చైనాలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించడంతో పాటు, చైనాలో ఉన్న వారి ఆస్తులను కూడా ఫ్రీజ్ చేస్తున్నట్లు వెల్లడించింది. తైవాన్ అంశం చైనా జాతీయ ప్రయోజనాల్లో అత్యంత కీలకమైందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. తైవాన్ విషయాన్ని అమెరికా-చైనా సంబంధాల్లో 'రెడ్ లైన్'గా అభివర్ణిస్తూ, ఆ రేఖను దాటవద్దని హెచ్చరించారు. తైవాన్‌కు ఆయుధాలు విక్రయించే ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తి అయినా తగిన మూల్యం చెల్లించక తప్పదని చైనా స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా గత వారం తైవాన్‌కు భారీ ఆయుధాల విక్రయానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారు. ఈ ఆయుధ విక్రయాల విలువ 10 బిలియన్ డాలర్లు, అంటే సుమారు రూ.84 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఇందులో మధ్యశ్రేణి క్షిపణులు, హోవిట్జర్ ఫిరంగులు, అత్యాధునిక డ్రోన్లు, హిమార్స్ రాకెట్ వ్యవస్థలు, యాంటీఆర్మర్ డ్రోన్లు వంటి ఎనిమిది ఆయుధ ప్యాకేజీలు ఉన్నాయి.ఈ ఎనిమిది ప్యాకేజీల్లో ఐదింటికి సంబంధించి ఇప్పటికే తైవాన్ బడ్జెట్ కేటాయింపులు చేసినట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎం109ఏ7 హోవిట్జర్లు, హిమార్స్ రాకెట్ వ్యవస్థలు, టీఓడబ్ల్యూ2బీ యాంటీ ట్యాంక్ క్షిపణులు, యాంటీఆర్మర్ డ్రోన్లు, ఎఫ్జీఎం 148బీ జావెలిన్ క్షిపణులు ఇందులో ఉన్నాయని పేర్కొంది. దీనికి తైవాన్ చట్టసభ ఆమోదం మాత్రమే మిగిలి ఉందని వెల్లడించింది.

# ఆ పది విపత్తుల నష్టం రూ.10 లక్షల కోట్లు



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది సంభవించిన పది అత్యంత భారీ విపత్తులు ఏకంగా రూ.10 లక్షల కోట్లకు పైగా నష్టాన్ని మిగిల్చినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో అత్యధిక ఆర్థిక నష్టానికి కారణమైన ఘటనగా అమెరికాలోని కాలిఫోర్నియా కార్చిచ్చు నిలిచింది. ఈ కార్చిచ్చు ఘటన వల్ల సుమారు 60 బిలియన్ డాలర్ల నష్టం జరిగినట్లు అంచనా వేయగా, 400కు పైగా మరణాలు సంభవించాయని నివేదిక పేర్కొంది.ఆగ్నేయాసియా దేశాలను తుపాన్లు, వరదలు అతలాకుతలం చేశాయి. ఈ ప్రకృతి విపత్తుల కారణంగా దాదాపు 25 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లడంతో పాటు 1750 మంది ప్రాణాలు కోల్పోయారు. థాయ్‌లాండ్, ఇండోనేసియా, శ్రీలంక, వియత్నాం, మలేసియా దేశాల్లోనూ విపత్తుల ప్రభావం తీవ్రంగానే ఉందని నివేదిక పేర్కొంది. చైనాలో వరదల కారణంగా 11.7 బిలియన్ డాలర్ల నష్టం సంభవించింది. వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చింది. బ్రెజిల్‌లో కరవు పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపగా, స్పెయిన్, పోర్చుగల్‌లలో కార్చిచ్చులతో భారీ నష్టాన్ని చవిచూసింది. ఆస్ట్రేలియా, ఆఫ్రికా తీర ప్రాంతాల్లో సంభవించిన తుపానులు కూడా ఆర్థికంగా తీవ్ర దెబ్బతీయడంతో పెద్ద మొత్తంలో నష్టాన్ని మిగిల్చాయి. భారత్‌లోనూ భారీ వరదలు ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేశాయి. పాకిస్తాన్‌లో వరదల కారణంగా 1860 మంది మరణించగా, దాదాపు 70 లక్షల మంది ప్రభావితమయ్యారు. అక్కడ మొత్తం 6 బిలియన్ డాలర్ల నష్టం జరిగినట్లు అంచనా. ఫిలిప్పీన్స్ లో టైఫూన్‌ల కారణంగా లక్షలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లగా, 5 బిలియన్ డాలర్లకుపైగా నష్టం జరిగినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఇక, మొత్తంగా ఈ పది విపత్తుల ప్రభావంతో 122 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా. బీమా నష్టాల ఆధారంగా ఈ లెక్కలు రూపొందించగా, వాస్తవ ఆర్థిక నష్టం మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ధనిక దేశాల్లో బీమా వినియోగం ఎక్కువగా ఉండటంతో నష్టాలపై పూర్తి గణాంకాలు లభ్యమవుతుండగా, పేద దేశాల్లోనూ అత్యంత వినాశకర ఘటనలు భారీ ఆర్థిక నష్టాన్ని మిగిల్చినట్లు నివేదిక స్పష్టం చేసింది.

# అక్కడ పెళ్లి వద్దన్నా...గర్భవతైనా శిక్షే



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
అక్కడ పెళ్లి చేసుకోకపోయినా శిక్షే.. పెళ్లికి ముందే గర్భం దాల్చినా భారీ జరిమానాలే. ఇది ఏ పురాణకాలపు కథ కాదు. ఆధునిక చైనాలోని ఓ మారుమూల గ్రామంలో అమలుకు ప్రయత్నించిన వింత నిబంధనలు. చైనాలో నిబంధనలు కఠినంగా ఉంటాయన్నది తెలిసిందే. అయితే యునాన్ ప్రావిన్స్‌లోని లింకాంగ్ గ్రామంలో అమలు చేయాలనుకున్న నియమాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.''గ్రామ నిబంధనలు.. అందరూ సమానమే'' అనే శీర్షికతో గ్రామ కమిటీ జారీ చేసిన నోటీసులో వ్యక్తిగత జీవితాన్ని నియంత్రించే పలు కఠిన షరతులు ఉన్నాయి. పెళ్లి చేసుకోకుండా ఉంటే ఏడాదికి జరిమానా, పెళ్లికి ముందే గర్భం దాల్చితే శిక్ష, లివ్ ఇన్ రిలేషన్‌లో ఉంటే ఫైన్ అంటూ నియమాలను గ్రామంలో పెట్టుకున్నారు. ఈ నోటీసు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. యునాన్ ప్రావిన్స్ వెలుపల వ్యక్తిని వివాహం చేసుకుంటే 1500 యువాన్లు అంటే సుమారు రూ.17,500 జరిమానా విధిస్తామని షరతు పెట్టారు. పెళ్లికి ముందే గర్భం దాల్చితే 3 వేల యువాన్లు (దాదాపు రూ.35 వేలు) చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. పెళ్లి చేసుకోకుండా కలిసి నివసించే జంటలకు ఏడాదికి 500 యువాన్లు అంటే రూ.6,400 ఫైన్ విధిస్తామని కట్టుబాటు తెచ్చారు. పెళ్లైన పది నెలల్లోపే సంతానం కలిగితేనూ 3 వేల యువాన్ల జరిమానా విధించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఇవే కాకుండా భార్యాభర్తల మధ్య గొడవలు, మద్యం సేవించి కలహాలు, గ్రామంలో పుకార్లు వ్యాప్తి చేయడం వంటి అంశాలపైనా జరిమానాలు విధించాలని కట్టుబాట్లు తీసుకువచ్చారు. దంపతులు గొడవపడి గ్రామ అధికారులను పిలిస్తే ఇద్దరూ చెరో 500 యువాన్లు చెల్లించాలి. మద్యం సేవించి గొడవలు చేస్తే 3 వేల నుంచి 5 వేల యువాన్ల వరకు ఫైన్ విధిస్తారు. నిరాధార ఆరోపణలు, పుకార్లు పుట్టించినా 500 నుంచి 1,000 యువాన్ల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుందని గ్రామ కమిటీ నోటీసులో తెలిపింది. ఈ నోటీసుపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన అంటూ తీవ్రంగా మండిపడ్డారు. మనం 2025లో ఉన్నామా లేక 1925లో ఉన్నామా అంటూ విమర్శలు గుప్పించారు. వివాదం ముదరడంతో మెంగ్‌డింగ్ పట్టణ ప్రభుత్వ అధికారులు స్పందించారు. గ్రామ కమిటీ పై అధికారుల అనుమతి లేకుండానే ఈ నోటీసును జారీ చేసిందని వెల్లడించారు. ఈ నిబంధనలు అసాధారణమైనవని పేర్కొంటూ నోటీసును తొలగించినట్లు స్పష్టం చేశారు. చైనా ప్రభుత్వం దేశవ్యాప్తంగా జననాల రేటు పెంచేందుకు ప్రయత్నిస్తుండగా, ఒక గ్రామం ఇలాంటి కఠిన నిబంధనలు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసిందని అధికారులు వ్యాఖ్యానించారు.

# పాక్ లో వైమానిక దళంగా ఉగ్రసంస్థ



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
పాకిస్తాన్ సైన్యానికి పోటీగా ఆదేశానికే చెందిన ఉగ్రవాద సంస్థ తేహ్రీక్ ఇతాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) మరోసారి సంచలన ప్రకటన చేసింది. వచ్చే ఏడాదిలో ప్రత్యేక వైమానిక దళాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించి పాక్ అధికారుల్లో కలకలం రేపింది. దేశ రక్షణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని టీటీపీ శుక్రవారం వెల్లడించింది. అఫ్గానిస్తాన్ లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, వారి మద్దతు ఉందన్న అనుమానాల మధ్య టీటీపీ కొత్త ప్రణాళికలు రూపొందించుకుని తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. పాకిస్తాన్ సైన్యానికి పోటీగా వైమానిక దళాన్ని ఏర్పాటు చేస్తామని సోషల్ మీడియాలో టీటీపీ పెడుతున్న పోస్టులు అధికారులను కలవరపెడుతున్నాయి. టీటీపీ వర్గాల కథనం ప్రకారం ఈ వైమానిక దళాన్ని సలీం హక్కానీ నేతృత్వంలో నడిపించనున్నారు. ప్రావిన్స్‌ల వారీగా మోహరింపులు చేపట్టడం, మిలిటరీ యూనిట్లను ఏర్పాటు చేయడం, అలాగే మిలిటరీ కమాండర్లతో కూడిన రెండు కొత్త పర్యవేక్షణ జోన్‌లను స్థాపించాలని టీటీపీ భావిస్తున్నట్లు వెల్లడైంది. 2026లో ఈ వైమానిక దళాన్ని ఏర్పాటు చేసి కశ్మీర్, గిల్గిత్‌బాల్టిస్తాన్ తో పాటు మరికొన్ని ప్రావిన్స్‌లను తమ ఆధీనంలోకి తీసుకోవాలని టీటీపీ వ్యూహరచన రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే మిలిటరీ యూనిట్లలో నాయకత్వ మార్పులు కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. గతంలో 2022 నవంబరులో పాక్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని టీటీపీ ముగింపు పలికింది. ఆ తర్వాత నుంచి పాక్ భద్రతా దళాలు, పోలీసులు, ప్రభుత్వ అధికారులపై వరుస దాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలోచిస్తాన్ ప్రావిన్స్‌లలో తన కార్యకలాపాలను విస్తరించింది. అఫ్గానిస్తాన్ భూభాగం నుంచే టీటీపీ ఉగ్రదాడులకు పాల్పడుతోందని పాక్ అధికారులు ఆరోపిస్తుండగా, తాలిబన్ ప్రభుత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తోంది.



## రైలా..? రాకెటా..? 2 సెకండ్లలో 700 కి.మీ

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
హైస్పీడ్ రైలు సాంకేతికతలో చైనా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ పరిశోధకులు రూపొందించిన, సూపర్ కండక్టింగ్ ఎలక్ట్రిక్ మాగ్లేవ్ రైలును విజయవంతంగా పరీక్షించారు. ఇది కేవలం రెండు సెకన్లలోనే గంటకు 700 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం గమనార్హం. దాదాపు ఒక టన్ను బరువున్న ఈ వాహనాన్ని 400 మీటర్ల పొడవైన మాగ్లేవ్ ట్రాక్‌పై పరీక్షించారు. ఈ ప్రయోగంలో వాహనం అత్యంత వేగంతో కదిలి చివరకు సురక్షితంగా ఆగిపోయింది. ఇది ఇప్పటివరకు పరీక్షించిన అత్యంత వేగవంతమైన సూపర్ కండక్టింగ్ మాగ్లేవ్ రైలు అని చెప్పవచ్చు. ఈ ఘనతతో దూర నగరాల మధ్య ప్రయాణ సమయం నిమిషాలకు తగ్గిపోయే అవకాశం ఉంది.ఈ రైలు పట్టాలను తాకకుండా గాలిలో తేలుతూ ప్రయాణిస్తుంది. దీనికోసం శక్తివంతమైన సూపర్ కండక్టింగ్ అయస్కాంతాలను వాడారు. దీనివల్ల రైలుకు, పట్టాలకు మధ్య రాపిడి ఉండదు. దీని ఫలితంగా ఇది అత్యంత వేగంతో దూసుకుపోతుంది. ఈ ప్రయోగంలో వాడిన విద్యుదయస్కాంత సాంకేతికత ఎంత శక్తివంతమైనదంటే, దీనిని రాకెట్లను ప్రయోగించడానికి కూడా వాడవచ్చని చైనా శాస్త్రవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## మహిళల రక్షణ కోసం 'వన్ స్టాప్ సెంటర్'

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
కెనడాలో ఆపదలో ఉన్న భారతీయ మహిళలను ఆదుకునేందుకు, టొరంటోలోని భారత కాన్సులేట్ 'వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్' పేరుతో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది 24 గంటల పాటు అందుబాటులో ఉండే హెల్ప్ లైన్‌ను కలిగి ఉంటుందని భారత కాన్సులేట్ తెలిపింది. గృహ హింస, దాడి, కుటుంబ వివాదాలు, దోపిడీ, న్యాయపరమైన సవాళ్లు ఎదుర్కొంటున్న, భారత పాస్‌పోర్టు కలిగిన విదేశాల్లో ఉండే భారతీయ మహిళలకు సత్వర సహాయం అందించడమే ఈ కేంద్రం ముఖ్య లక్ష్యం. బాధిత మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్' ద్వారా 24 గంటల హెల్ప్ లైన్ తక్షణ కౌన్సిలింగ్, మానసిక మద్దతు కెనడా చట్టాలకు లోబడి ఉచిత న్యాయ సలహాలు, సంబంధిత విభాగాల సమన్వయంతో చట్టపరమైన సహాయం అందిస్తామని భారత కాన్సులేట్ పేర్కొంది. మహిళా అధికారి నేతృత్వంలో ఈ కేంద్రం నిర్వహించబడుతుందని, దీనికి సంబంధించిన వివరాలు కాన్సులేట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని భారత కాన్సులేట్ వర్గాలు వెల్లడించాయి.



## మునీర్ దెబ్బతో పాక్ కు... మేధావులు గుడ్ బై

**మొదటిపేజీ తరువాయి...**
పాక్ బ్యూరో ఆఫ్ ఎమిగ్రేషన్ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ భయానక వాస్తవాన్ని ప్రపంచం ముందు అవిష్కరించాయి. గత 24 నెలల్లోనే పాకిస్తాన్ తన దేశానికి చెందిన 5,000 మంది డాక్టర్లు, 11,000 మంది ఇంజినీర్లు, 13,000 మంది అకౌంటెంట్లను కోల్పోయింది. ప్రస్తుతమున్న కేవలం కూలీలు, సామాన్య కార్మికులే కాకుండా దేశ గతిని మార్చగల మేధావులు కూడా విదేశాలకు తరలిపోతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. 2024లో సుమారు 7.27 లక్షల మంది విదేశీ ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికే ఆ సంఖ్య 6.87 లక్షలు దాటింది. ముఖ్యంగా నర్సుల వలసలు 2011తో పోలిస్తే ఏకంగా 2,144 శాతం పెరగడం గమనార్హం. ఆసిమ్ మునీర్ 'బ్రెయిన్ గెయిన్' కామెంట్లపై నెటిజన్ల ఫైర్!దేశం భారీ స్థాయిలో మేధావులు వలసపోతుంటే , పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. భవిష్యత్తులో దేశానికి మేలు చేసే 'బ్రెయిన్ గెయిన్' అని ఆయన అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలపై పాక్ పౌరులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "దేశం నాశనమవుతుంటే ఆయన పగటి కలలు కంటున్నారు" అని కొందరు, "అధికారం కోసం ప్రజలను హింసిస్తూ, మేధావులను బయటకు పంపి గర్వంగా మాట్లాడుతున్నారు" అని మరికొందరు మండిపడుతున్నారు. పాక్ మాజీ సెనేటర్ ముస్తఫా నవాజ్ ఖోఖర్ ఈ పరిస్థితిని విశ్లేషిస్తూ.. రాజకీయాలను చక్కదిద్దకుండా ఆర్థిక వ్యవస్థను బాగు చేయలేమని ఆయన హెచ్చరించారు. పాకిస్తాన్ ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఫ్రీలాన్సింగ్ హబ్ అయినప్పటికీ, అక్కడ తరచూ విధిస్తున్న ఇంటర్నెట్ షట్‌డౌన్‌ల వల్ల 1.62 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని, 2.37 మిలియన్ల మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుల్లో ఆంక్షలుమేధావుల వలసను అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎయిర్‌పోర్టుల్లో తనిఖీలను కఠినతరం చేస్తోంది. 2025లో ఏకంగా 66,154 మందిని విమానం ఎక్కకుండానే తిరిగి వెనక్కి పంపారు. భిక్షాటన ముఠాలు, అక్రమ వలసదారులను అడ్డుకోవాలనే సాకుతో సామాన్య నిపుణులను కూడా వేధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధి అవకాశాలు లేక, కనీస వాక్ స్వాతంత్ర్యం లేని 'కఠిన దేశం'లో ఎవరూ ఉండాలనుకోవడం లేదని పాక్ విద్యావంతులు మరోవైపు స్పష్టం చేస్తున్నారు.



## జిల్లాల పునర్విభజనపై
# సీఎం సమీక్ష

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన ప్రక్రియపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 31వ తేదీన జిల్లాల పునర్విభజనకు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో శనివారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గత నెల 27న విడుదల చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వం నెల రోజుల గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ గడువు శనివారంతో ముగియడంతో, ఇప్పటివరకు అందిన 927 అభ్యంతరాలపై ముఖ్యమంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. భౌగోళిక పరిస్థితులు, ప్రజల సౌకర్యార్థం వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో అవసరమైన మార్పులు చేర్పులు చేసిన తర్వాత, డిసెంబర్ 31న అధికారికంగా తుది నోటిఫికేషన్ విడుదల కానుంది. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ పునర్విభజన చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో మెజారిటీ అంశాలను సానుకూలంగా పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ సమీక్షలో జిల్లాల వారీగా ఉన్న క్షేత్రస్థాయి పరిస్థితులపై మంత్రులు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రికి వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఎదురయ్యే మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బంది సర్దుబాటుపై కూడా ప్రాథమికంగా చర్చించారు. కొత్త ఏడాది నుంచి పునర్విభజన ప్రక్రియ కార్యరూపం దాల్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



## పిడుగురాళ్లలో
# ఎరువుల దుకాణాల తనిఖీ

**పిడుగురాళ్ల (ఏడీఎన్ఎన్) :**

పిడుగురాళ్ల మండల వ్యవసాయ అధికారి ఎం. సంధ్యారాణి శనివారం మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో స్టాక్ రిజిస్టర్‌కు, భౌతికంగా ఉన్న నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఆమె గుర్తించారు. సుమారు 65.1 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వల్లో తేడాలు ఉన్నాయని, వీటి విలువ రూ. 13 లక్షల 53 వేల పైచిలుకు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిబంధనల ఉల్లంఘన జరిగిన నేపథ్యంలో సదరు నిల్వల అమ్మకాలను తక్షణమే నిలుపుదల చేస్తూ ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ, వ్యాపారులు ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా లేదా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ప్రస్తుతం 350 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. ప్రతి దుకాణం వద్ద ఎరువుల లభ్యత మరియు ధరలను సూచించే బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని వ్యాపారులను ఆదేశించారు. రైతులు తమకు కావాల్సిన ఎరువులను సొసైటీలు లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని ఆమె సూచించారు.



## 'రప్పారప్పా'
# డైలాగ్ నేరమా?

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తట్టుకోలేకపోతున్నారని వైసీపీ నేత కురసాల కన్నబాబు విమర్శించారు. మీడియా సమావేశంలో శనివారం మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అనుసరిస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరగడం, మరోవైపు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం 'జంతుబలి' పేరుతో కొత్త డ్రామా ఎత్తుకుందని కన్నబాబు ఆరోపించారు. అమరావతిలో రాజధానికి భూమి ఇచ్చిన రైతు గుండె పగిలి చనిపోతే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆయన నిలదీశారు. జంతుబలి అంటూ నానా గొడవ చేస్తున్న హోంమంత్రి అనితకు గత చరిత్ర తెలియదా అని ఆయన ప్రశ్నించారు. "గతంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలకు అనేక పొట్టేళ్లను బలి ఇచ్చారు. బాలకృష్ణ సినిమా ఫ్లెక్సీలకు పొట్టేళ్ల తలకాయలతో దండలు వేశారు. మరి అప్పుడు హోంమంత్రి వారిని ఎందుకు ప్రశ్నించలేదు? కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపైనే మీ ప్రతాపమా?" అని మండిపడ్డారు. సినిమాలోని 'రప్పారప్పా' అనే డైలాగ్‌ను పోస్టర్‌పై వేస్తే కేసులు పెట్టడం హాస్యాస్పదమని కన్నబాబు అన్నారు. ఆ డైలాగ్ తప్పయితే సెన్సార్ బోర్డ్ ఎలా అంగీకరించిందని ఆయన ప్రశ్నించారు. హోంమంత్రికి అధికారం కళ్లు గప్పిందని, అందుకే వాస్తవాలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలో ఒక మహిళపై లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతోందని విమర్శించారు. బల్క్ డ్రగ్ పార్క్ విషయంలో హోంమంత్రి అనిత ఎన్నికల ముందు ఒక మాట, ఇప్పుడు ఒక మాట మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులపై దుర్మార్గంగా వ్యవహరిస్తే ప్రజలు సహించరని, కేవలం పబ్లిసిటీ, మీడియా మేనేజ్‌మెంట్‌తోనే ఈ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తోందని కన్నబాబు దుయ్యబట్టారు.

# వైకుంఠద్వార దర్శనాలకు ఏర్పాట్లు...

**తిరుపతి (ఏడీఎన్ఎన్) :**

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠద్వార దర్శనాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, అన్నప్రసాదం, ఇతర మౌలిక సదుపాయాలలో కీలక మార్పులు చేసినట్లు అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. శనివారం ఆయన అధికారులతో కలిసి శిలాతోరణం ప్రాంతంలోని క్యూలైన్లను స్వయంగా తనిఖీ చేసి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వేడి అన్నప్రసాదాలు, తాగునీరు, అదనపు శౌచాలయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మొబైల్



వాటర్ డ్రమ్స్, ఫుడ్ వ్యాన్లను సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు, తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్‌లో జారీ చేసే ఎస్ఎస్‌డీ టోకెన్ల విషయంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నియంత్రించేందుకు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఈ టోకెన్ల జారీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. భక్తులు ఈ మార్పును గమనించి టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. టోకెన్లు లేని వారు అనవసరంగా తిరుపతిలో వేచి ఉండకుండా తమ ప్రయాణాలను ప్రణాళికాబద్ధంగా మార్చుకోవాలని సూచించింది. దర్శన మార్గదర్శకాల ప్రకారం, ఈ నెల 30, 31 వచ్చే నెల 1వ తేదీలలో కేవలం ఈడిప్ ద్వారా ముందస్తుగా టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వైకుంఠద్వార దర్శనం కల్పిస్తారు. టోకెన్ పొందిన వారు తమకు కేటాయించిన తేదీ, నిర్దేశించిన సమయానికి మాత్రమే దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇక దర్శన టోకెన్లు లేని సాధారణ భక్తులు జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు సర్వదర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠద్వార దర్శనం పొందే అవకాశం ఉంటుందని టీటీడీ స్పష్టం చేసింది.

# మల్లన్నకు రికార్డు స్థాయిలో ఆదాయం

**శ్రీశైలం (ఏడీఎన్ఎన్) :**

వరుస సెలవుల నేపథ్యంలో ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం భక్తులతో కిక్కిరిసిపోయింది. మల్లికార్జున స్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్షేత్రంలో పండగ వాతావరణం నెలకొంది. నిన్న ఒక్కరోజే 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శనాలు సజావుగా సాగేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల రాకతో ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దర్శన టికెట్లు, లడ్డూ ప్రసాదాల విక్రయాలు, ఆర్జిత సేవలు, మనమిత్ర సేవలు మరియు కేశఖండన వంటి వివిధ సేవల ద్వారా నిన్న ఒక్కరోజే ఆలయానికి రూ. 1 కోటి 46 లక్షల 94 వేల ఆదాయం లభించింది. ఇదే సమయంలో భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన హుండీ కానుకలను కూడా దేవస్థానం అధికారులు శనివారం లెక్కించారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



# చంపాలనుకుంటే రండి.. నేను రెడీ!

- అర్ధరాత్రి హైవేపై దువ్వాడ శ్రీనివాస్ బహిరంగ సవాల్
- వైల్డ్ గా మారిన ఫోన్ కాల్ ఆడియో

**టెక్కలి (ఏడీఎన్ఎన్) :**

శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ధర్మాన సోదరుల మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు వీధికెక్కింది. తనను అంతం చేసేందుకు ధర్మాన సోదరులు కుట్ర పన్నారంటూ దువ్వాడ శ్రీనివాస్ చేసిన ఆరోపణలు జిల్లావ్యాప్తంగా పెను సంచలనం సృష్టించాయి. ఈ వివాదానికి ప్రధాన కారణం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఆడియో కాల్. నిమ్మాడకు చెందిన అప్పన్న అనే వైసీపీ కార్యకర్త, దువ్వాడ శ్రీనివాస్ సతీమణి దివ్వెల మాధురికి ఫోన్ చేసి హెచ్చరించినట్లు ఆ ఆడియోలో ఉంది. నర్సన్నపేట లేదా నిమ్మాడ జంక్షన్ వద్ద దువ్వాడపై దాడి చేసేందుకు ధర్మాన సోదరులు అల్లరి మూకలను సిద్ధం చేస్తున్నా




రని ఆ కార్యకర్త సమాచారం ఇచ్చారు. ఈ ఆడియో బయటకు రావడంతో దువ్వాడ వర్గంలో ఆందోళన మొదలైంది. ఫోన్ కాల్ వ్యవహారం తెలిసిన వెంటనే హైదరాబాద్ నుంచి నేరుగా నిమ్మాడ జంక్షన్‌కు చేరుకున్న దువ్వాడ శ్రీనివాస్, శుక్రవారం అర్ధరాత్రి నేషనల్ హైవేపై ప్రత్యక్షమయ్యారు. రోడ్డుపై నిలబడి తన ప్రత్యర్థులకు బహిరంగ సవాల్ విసిరారు. "చంపాలనుకుంటే రండి.. నేను ఇక్కడే ఉన్నాను, దేనికైనా సిద్ధం!" అంటూ సవాలు విసిరారు. ప్రశ్నలడిగితే ప్రాణాలు తీస్తారా? అంటూ ఆయన నిలదీశారు. తన ప్రాణాలకు ఏ హాని జరిగినా ధర్మాన సోదరులదే బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌లను ఉద్దేశించి దువ్వాడ సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరినీ 'కేడీ బ్రదర్స్'గా అభివర్ణించిన ఆయన, ఒకరు అధికార పార్టీలో, మరొకరు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ లోపాయకారి ఒప్పందాలతో జిల్లా రాజకీయాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో ప్రశ్నించే గొంతుకను నొక్కేయడం సరైంది కాదని హితవు పలికారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తానని దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని, దీని వెనుక ఉన్న కుట్రదారులు ఎవరనేది తేలాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం దువ్వాడ తీసిన సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ ఉద్రిక్తత నేపథ్యంలో పోలీసులు నిమ్మాడ, టెక్కలి ప్రాంతాల్లో నిఘా పెంచారు.

# రిటర్న్ గిఫ్ట్ తప్పదు...!

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర హోంమంత్రి అనిత తీరుపై వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా చోడవరంలో జరిగిన పరిణామాలపై పోలీసులు వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని ఆమె తప్పుబట్టారు. ఈ సందర్భంగా హోంమంత్రికి ఆమె ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. చోడవరంలో అభిమాన నాయకుడి పుట్టినరోజున ఫ్లెక్సీలపై సినిమా డైలాగులు వేస్తే అది నేరమా? అని వరుదు కల్యాణి ప్రశ్నించారు. "అభిమానులు తమ నాయకుడిపై రకరకాలుగా అభిమానాన్ని చాటుకుంటారు. గతంలో నటుడు బాలకృష్ణ సినిమా విడుదల సమయంలో మేకపోతులను బలి ఇచ్చినప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్టులు చేయలేదు? అప్పుడు లేని చట్టాలు ఇప్పుడే గుర్తొస్తున్నాయా?" అని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఆడపిల్లలపై వరుసగా అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతుంటే హోంమంత్రి ఏం చేస్తున్నారని ఆమె నిలదీశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందిన ప్రభుత్వం, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. హోంమంత్రి తన ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, అధికార గర్వంతో వ్యవహరిస్తున్నా




రని వరుదు కల్యాణి విమర్శించారు. "మీ పాలన మీరు నచ్చినట్లు చేసుకోండి, కానీ గుర్తుపెట్టుకోండి.. రేపు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఖచ్చితంగా 'రిటర్న్ గిఫ్ట్' ఇస్తాం" అంటూ ఆమె స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని వైసీపీ శ్రేణులను వేధింపులకు గురిచేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.

# వివాహితపై సామూహిక అత్యాచారం..

- 10 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘటన

**కుప్పం (ఏడీఎన్ఎన్) :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. కుప్పం మండలం ఎన్.కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని నిమ్మకంపల్లి గ్రామంలో ఒక వివాహితపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులు బాధితురాలిని ప్రాణభయంతో బెదిరించడంతో, పది రోజుల తర్వాత ఈ అమానుషం బయటపడింది. పది రోజుల క్రితం ఈ ఘటన జరగగా, నిందితులు బాధితురాలిని తీవ్రంగా హెచ్చరించారు. "ఈ విషయం బయటకు చెబితే నీ భర్తను, పిల్లలను చంపేస్తాం," అంటూ బెదిరించడంతో ఆమె తీవ్ర భయాందోళనలకు గురైంది. జరిగిన ఘోరాన్ని బయటకు చెప్పుకోలేక 10 రోజుల పాటు నరకయాతన అనుభవించిన బాధితురాలు, చివరకు శనివారం తన భర్త మణికి జరిగిన విషయాన్ని వివరించింది. భార్య పడుతున్న మానసిక వేదనను చూసి చలించిపోయిన భర్త, వెంటనే కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు నిందితులలో ఇద్దరిని ఇప్పటికే అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బాధితురాలిని ప్రస్తుతం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. "నిందితులు నా భార్యను, పిల్లలను చంపేస్తామని బెదిరించారు. ఆ భయంతోనే ఆమె పది రోజులుగా మానసిక క్షోభ అనుభవించింది. జరిగిన



అన్యాయానికి బాధ్యులైన ఆ ముగ్గురు యువకులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి," అని బాధితురాలి భర్త మణి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపింది. మహిళా భద్రతపై ప్రతిపక్షాలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మా అమ్మాయి పేరుతో విద్యా సంస్థను నెలకొల్పాలి

- మహిళా కమిషన్‌కు తల్లిదండ్రుల విన్నపం

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

విజయవాడలో 18 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆయేషా మీరా సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె తల్లిదండ్రులు శంషాద్ బేగం, బాషా గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను కలిసి ఒక కీలక వినతిపత్రాన్ని అందజేశారు. తమ కుమార్తె జ్ఞాపకార్థం ఒక విద్యా సంస్థను ప్రభుత్వం నెలకొల్పాలని, అలాగే ఆమె హత్యకు గురైన డిసెంబర్ 27వ తేదీని ప్రతిఏటా అధికారికంగా సంస్మరణ దినోత్సవంగా నిర్వహించాలని వారు కోరారు. సమాజంలో మహిళా భద్రతపై అవగాహన కల్పించేందుకు, అలాగే ఆయేషా స్మృతిని



సజీవంగా ఉంచేందుకు ఇది అవసరమని వారు ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనయ్యారు. 2007 డిసెంబర్ 27న ఇబ్రహీంపట్నంలోని ఒక హాస్టల్‌లో ఫార్మసీ విద్యార్థినిగా ఉన్న ఆయేషా మీరా దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ ఘటన జరిగి 18 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అసలు నిందితులు ఎవరో తేలక పోవడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ కేసులో సత్యంబాబును నిందితుడిగా భావించినప్పటికీ, కోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసింది. అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు దర్యాప్తును చేపట్టింది. సుమారు 266 మందిని విచారించిన సీబీఐ, ఇటీవల తన తుది నివేదికను సీల్డ్ కవర్‌లో విజయవాడ సీబీఐ కోర్టుకు సమర్పించింది. అయితే ఆ నివేదికలో ఏముందనే విషయం తమకు తెలియజేయలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ కేసు తుది తీర్పు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో, ఆయేషా మీరా పేరుతో విద్యా సంస్థను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. తమకు న్యాయం జరగడంలో సుదీర్ఘ జాప్యం జరుగుతోందని, కనీసం తమ కుమార్తె పేరు మీద ఒక సేవా సంస్థను ఏర్పాటు చేసి భవిష్యత్ తరాల ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. మహిళా కమిషన్ దీనిపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని వారు కోరుతున్నారు.



## పొందూరు ఖద్దర్‌కు
# అంతర్జాతీయ గుర్తింపు

- నేతన్నల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది : మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం జిల్లా (ఏడీఎన్ఎన్) :**

శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణమైన పొందూరు ఖద్దర్‌కు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించడం పట్ల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఐ ట్యాగ్ ద్వారా లభించే ప్రతి ప్రయోజనం నేరుగా చేనేత కార్మికులకే అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పొందూరు ఖద్దర్ కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్తి అని, తెలుగువారి హుందాతనాన్ని, సంస్కృతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిన ఘనత దీనికి ఉందని ఆయన కొనియాడారు. పత్తి నుంచి దారం తీయడం దగ్గర నుండి వస్త్రాన్ని చేతితో నేయడం వరకు ప్రతి దశలోనూ ఇక్కడి కార్మికుల నైపుణ్యం అద్భుతమని మంత్రి ప్రశంసించారు. జాతిపిత మహాత్మా గాంధీ సైతం పొందూరు ఖద్దర్ నాణ్యతను చూసి ముగ్ధులయ్యారని గుర్తు చేసిన మంత్రి, ఆధునిక కాలంలో ఎన్ని మిల్లు వస్త్రాలు వస్తున్నప్పటికీ పొందూరు ఖాదీకి ఉన్న క్రేజ్ తగ్గలేదని స్పష్టం చేశారు. పొందూరు ఖాదీ వైభవాన్ని పునరుద్ధరించడమే తమ లక్ష్యమని, దీని కోసం ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొందూరు వస్త్రాలకు డిమాండ్ పెంచడం ద్వారా ఇక్కడి నేతన్నల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తామని ఆయన పేర్కొన్నారు. జీఐ ట్యాగ్ వల్ల కలిగే లాభాలను వివరిస్తూ, భవిష్యత్తులో నకిలీ వస్త్రాల బెడద తప్పుతుందని, తద్వారా అసలైన చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర లభిస్తుందని మంత్రి రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతుతో పొందూరు ఖాదీకి పూర్వ వైభవం తీసుకువస్తామని, నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఆయన పునరుద్ఘాటించారు.

## ఏపీలో ఐదుగురు ఐఏఎస్
# అధికారులకు పదోన్నతి

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. 2010 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులను 'సూపర్ టైమ్ స్కేల్' (పే మ్యాట్రిక్స్ లెవల్ 14)కు పెంచుతూ, వారిని ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదోన్నతులు వచ్చే నెల 1వ తేదీ నుండి అధికారికంగా అమలులోకి వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా పాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పదోన్నతి పొందిన అధికారులలో అమ్రపాలి కటా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల్లోనే కొనసాగనున్నారు. అలాగే, డా. నారాయణ భరత్ గుప్తా కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా, ఆర్‌యూఎస్‌ఏ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా తన ప్రస్తుత పదవిలోనే సేవలందిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న చదలవాడ నాగరాణి కూడా అదే బాధ్యతల్లో కొనసాగుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఐఏఎస్ అధికారి జె. నివాస్ కూడా ఈ సూపర్ టైమ్ స్కేల్ పదోన్నతి పొందిన వారి జాబితాలో ఉన్నారు. మరోవైపు, గంధం చంద్రుడు కార్మిక శాఖ కమిషనర్‌గా కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో అదనపు బాధ్యతలు నిర్వహించిన ఎం.వి. శేషగిరి బాబును ఆ బాధ్యతల నుండి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.



## చెత్త రిక్షాలో మహిళా
# మృతదేహం తరలింపు

- అభివృద్ధి.... అమరావతికేనా?

**పార్వతీపురం (ఏడీఎన్ఎన్) :**

ఒకవైపు రాష్ట్రం డిజిటల్ విప్లవం, ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని పాలకులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అత్యంత దారుణంగా ఉన్నాయి. కనీసం మనిషి ప్రాణం పోయాక గౌరవప్రదంగా సాగనంపే పరిస్థితి కూడా లేకపోవడం నేటి ప్రభుత్వాల పనితీరుకు అద్దం పడుతోంది. మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో జరిగిన హృదయవిదారక ఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసింది. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక నిరుపేద గిరిజన మహిళ మరణించగా, ఆమె మృతదేహాన్ని ఇంటికి తరలించడానికి కనీసం అంబులెన్స్ లేదా వైకుంఠ రథం అందుబాటులో లేకపోయింది. చేసేదేమీ లేక బంధువులు ఆ మృతదేహాన్ని మున్సిపాలిటీకి చెందిన చెత్త రిక్షాలో తరలించాల్సి వచ్చింది. డిజిటల్ ఇండియా, స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకుంటున్న తరుణంలో ఇలాంటి దృశ్యాలు కనిపించడం వ్యవస్థా లోపాలను ఎత్తిచూపుతోంది. "అమరావతి ఒక్కటే రాష్ట్రం కాదు" అనే నినాదం మళ్ళీ ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. అభివృద్ధి నిధులు కేవలం రాజధాని ప్రాంతం లేదా పెద్ద నగరాల చుట్టూ కేంద్రీకృతమవుతున్నాయని, ఉత్తరాంధ్రలోని మన్యం ప్రాంతాలు, రాయలసీమ వంటి వెనుకబడిన జిల్లాలను ప్రభుత్వం విస్మరిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెనుకబడిన జిల్లాలకు కేటాయించే 'స్పెషల్ ప్యాకేజీ' నిధులు ఏమవుతున్నాయని గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ఘటన నిధుల కొరత కంటే అధికారుల, పాలకుల బాధ్యతారాహిత్యం వల్లే జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆస్పత్రిలో అంబులెన్స్ రిపేర్‌లో ఉంటే దాన్ని బాగు చేయించడం లేదా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడం కనీస ధర్మం. కానీ, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన "గిరిజనుల ఉద్ధరణ" హామీలు ఇప్పుడు కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యాయని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రచారాలకు ఇచ్చే ప్రాధాన్యతను క్షేత్రస్థాయిలోని కనీస వైద్య సదుపాయాల కల్పనపై పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మన్యం జిల్లాలోని ప్రతి ఆసుపత్రికి తక్షణమే తగినన్ని వాహనాలు, వైద్య సిబ్బందిని కేటాయించి, ఇలాంటి అవమానకరమైన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పౌర సమాజం కోరుతోంది.

ఆదివారం | హైదరాబాద్
28.12.2025
www.manasarkar.com

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar





## ఉప ఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాజీనామా అంశంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.హిమాయత్‌నగర్ డివిజన్ కార్యకర్తలతో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉప ఎన్నికలకు వెళ్లేందుకు తనకు పూర్తి స్థాయి ధైర్యం ఉందని, అది తన కార్యకర్తలు ఇచ్చిన బలమేనని దానం స్పష్టం చేశారు. కార్యకర్తల అండదండలతోనే తాను ఆరు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించానని, ఇప్పుడు ఉప ఎన్నిక వచ్చినా తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ నాయకులపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వడం బీఆర్ఎస్ నేతలు విస్మరించారని, సీఎంను ఏకవచనంతో సంబోధిస్తూ అగౌరవంగా మాట్లాడటం తగదని మండిపడ్డారు. విమర్శలు చేసే క్రమంలో సంయమనం పాటించాలని, లేనిపక్షంలో ప్రతివిమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని దానం నాగేందర్ హెచ్చరించారు.



## డ్రగ్స్ కేసును నీరుగార్చారు

- సోమేశ్ కుమార్‌ను విచారించాలన్న బండి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో డ్రగ్స్ కేసులను ప్రభుత్వం సీరియస్ గా పరిగణించడం లేదని, పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిగిన డ్రగ్స్ విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. నాటి కేసులో అనేకమంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారని, అకున్ సబర్వాల్ టీం సేకరించిన కీలక ఆధారాలను, ఆడియో, వీడియో రికార్డులను నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు సంస్థలకు గానీ, కోర్టుకు గానీ అప్పగించకుండా కేసును నీరుగార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలోని 'ఈగల్ టీమ్' వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని డిమాండ్ చేశారు. ఈగల్ టీమ్‌లో కొందరు అధికారులు డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని విమర్శించిన బండి సంజయ్, రాష్ట్రంలో మాదకద్రవ్యాల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి విచారణ బాధ్యతలు అప్పగించాలని కోరారు.



## జర్నలిస్టుల గొంతు నొక్కేస్తున్నారు

జర్నలిస్టుల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

జర్నలిస్టుల సమస్యలపై శాంతియుతంగా వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన TUWJ-TJF నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం జర్నలిస్టుల ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మారుతి సాగర్, రమేశ్ హజారి వంటి కీలక నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## పేదవాడికి ఇందిరమ్మ రాజ్యం

**మహబూబాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో 'ఇందిరమ్మ రాజ్యం' వచ్చిందని, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.గత పదేళ్ల బీఆర్ఎస్ అరాచక పాలనకు స్వస్తి పలికి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియంతృత్వ పోకడలతో రాష్ట్రాన్ని రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని విమర్శించారు. ఇప్పుడు కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల అవినీతిపై విచారణ జరుగుతోందని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టానికి దొరకాల్సిందేనని హెచ్చరించారు. రెవెన్యూ వ్యవస్థలో మార్పులు తెస్తూ 'భూభారతి' ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తామని, ఆరు గ్యారంటీల అమలుతో పాటు మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని మంత్రి స్పష్టం చేశారు.



## గ్రామాభివృద్ధికి గ్రామసభలే కీలకం

**నిర్మల్ (ఏడీఎన్ఎన్) :**

నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ప్రజాసేవనే పరమావధిగా పనిచేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నిర్మల్‌లో జరిగిన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ పారదర్శక పాలన అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం



ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు రాబోతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పంచాయతీ ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తూ, మొత్తం 1551 స్థానాల్లో కాంగ్రెస్ 820 స్థానాలను గెలుచుకుని ప్రభంజనం సృష్టించిందని, బీఆర్ఎస్ 343, బీజేపీ 269 మరియు స్వతంత్రులు 110 స్థానాల్లో విజయం సాధించారని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నియోజకవర్గ ఇన్చార్జి శ్రీహరి రావు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## పుష్పా కు బిగ్ షాక్

- పోలీసుల ఛార్జిషీట్‌లో ఏ11గా అల్లు అర్జున్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

'పుష్ప 2' చిత్ర విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి పోలీసులు న్యాయస్థానంలో శనివారం ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు . హీరో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. సంధ్య థియేటర్ మేనేజ్‌మెంట్‌ను ప్రధాన నిందితుడు A1గా పేర్కొన్నారు . థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఛార్జిషీట్‌లో స్పష్టం చేశారు.నిందితుల జాబితాలో అల్లు అర్జున్ మేనేజర్, వ్యక్తిగత సిబ్బందితో పాటు ఎనిమిది మంది బౌన్సర్ల పేర్లను కూడా పోలీసులు పొందుపరిచారు. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి సుదీర్ఘ చికిత్స తర్వాత ఇటీవల డిశ్చార్జి అయ్యారు. బాధితుడి వైద్య ఖర్చులను అల్లు అర్జున్ కుటుంబమే



భరించినప్పటికీ, చట్టపరమైన ప్రక్రియలో భాగంగా పోలీసులు ఈ ఛార్జిషీట్ దాఖలు చేశారు.

## ప్రజల సొమ్ము ప్రతి పైసా ప్రజలకే

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**నేలకొండపల్లి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలోని ప్రతి పైసాను ప్రజల కోసమే ఖర్చు చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలం అనంతనగర్‌లో శనివారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో సంపదను సృష్టించి ప్రజలకు పంచాల్సింది పోయి, గత పాలకులు విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ధ్వజమెత్తారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం పేదలను వంచించిందని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. కేవలం పాలేరు నియోజకవర్గంలోనే 65 శాతం ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతుల సంక్షేమం కోసం విద్యుత్ శాఖకు ప్రభుత్వం రూ. 12,500 కోట్లు చెల్లిస్తోందని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మద్దతు ధరతో



పాటు బోనస్ ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని, ఈ అభివృద్ధిని చూసే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు 75 శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## నకిలీ గాంధీల మాటలను ఎవరూ నమ్మరు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

దేశంలో నకిలీ గాంధీల మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాంధీ పేరు లేకపోతే కాంగ్రెస్ నాయకులకు మనుగడ ఉండదని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో గాంధీ పేరుతో ప్రవేశపెట్టిన పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తండ్రి ప్రవేశపెట్టిన ఈవీఎంలను కొడుకు వ్యతిరేకించడం విడ్డూరంగా



ఉందని, రాహుల్ గాంధీకి తన తండ్రిపైనే నమ్మకం లేదని విమర్శించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తోందని, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ధ్వజమెత్తారు. మరోవైపు బీఆర్ఎస్‌పై స్పందిస్తూ.. హరీశ్ రావు , కేటీఆర్ వల్ల పార్టీని కాపాడటం సాధ్యం కాదని గ్రహించే కేసీఆర్‌ను మళ్లీ బయటకు తెచ్చారని, అయితే ఆయన రాకతో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేవలం డబ్బులు ఉన్నాయనే అహంకారంతోనే బీఆర్ఎస్ సభలు నిర్వహిస్తోందని, గతంలో జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఫలితాలే మళ్లీ పునరావృతమవుతాయని ఆయన జోస్యం చెప్పారు.

## టాలీవుడ్‌లో ఎన్నికల రణరంగం

- నేడే ఫిల్మ్ ఛాంబర్ పోలింగ్
- 'ప్రోగ్రెసివ్' వర్సెస్ 'మన' ప్యానెల్!

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అత్యున్నత సంస్థ అయిన 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికలు టాలీవుడ్‌లో రాజకీయ వేడిని రాజేశాయి. ఆదివారం జరగనున్న ఈ పోలింగ్ కోసం ఫిల్మ్ నగర్ సర్వం సిద్ధమైంది. పరిశ్రమలోని బడా నిర్మాతలు ఒకవైపు, చిన్న నిర్మాతలు మరోవైపు రెండు ప్యానెళ్లుగా విడిపోయి హోరాహోరీగా తలపడుతుండటంతో ఈ ఎన్నికలు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. చిన్న నిర్మాతలు ఈసారి బడా నిర్మాతలపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. పరిశ్రమ మొత్తం కొందరి గుప్పిట్లోనే ఉందంటూ వారు చేస్తున్న 'హాట్' కామెంట్స్ ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఎన్నికల సమయంలోనే పనికిమాలిన హామీలు ఇస్తున్నారని, చిన్న సినిమాలకు థియేటర్ల కేటాయింపు, టికెట్ ధరల నియంత్రణ వంటి కీలక అంశాలపై స్పష్టమైన హామీలు కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికలు 'ప్రోగ్రెసివ్' 'మన' ప్యానెళ్ల మధ్య 'ఢీ' అంటే 'ఢీ' అనేలా మారాయి. అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు వంటి వారి మద్దతుతో బరిలోకి దిగుతున్న ప్రోగ్రెసివ్ ప్యానెల్, పరిశ్రమను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు వ్యవస్థీకృత అభివృద్ధిని తమ లక్ష్యంగా ప్రకటించింది. మరోవైపు, సీ. కళ్యాణ్, చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్ వంటి దిగ్గజాల వెన్నెముకతో నడుస్తున్న మన ప్యానెల్, చిన్న నిర్మాతల హక్కుల పరిరక్షణ , పరిశ్రమలో సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతోంది. థియేటర్ల నిర్వహణ, వినోదపు పన్ను , డిజిటల్ రైట్స్ వంటి కీలక అంశాలపై ఈ ఎన్నికల ఫలితాలు తీవ్ర ప్రభావం చూపనున్నాయని, ఏ ప్యానెల్ విజయం సాధించినా టాలీవుడ్ భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ హోరాహోరీ పోరులో రేపు సాయంత్రం వెలువడే ఫలితాలు ఎవరికి పట్టం కడతాయో చూడాలి.





## తెలంగాణ విద్యుత్ శాఖకు జాతీయ అవార్డు

- భద్రతా ప్రమాణాల్లో ఎన్పీడీసీఎల్ ఘనత

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సేఫ్టీ అవార్డ్స్ 2024లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ 'సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్' అవార్డును దక్కించుకుంది. వినియోగదారుల సేవలు, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, ప్రమాదాల నివారణ , ఉద్యోగుల శిక్షణలో చూపిన ఉత్తమ పనితీరుకు గాను ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 23న ముంబయిలో జరిగిన కార్యక్రమంలో సీఈ ఎన్. శ్రవణ్ కుమార్, డీఈ వై. రాంబాబు ఈ అవార్డును అందుకున్నారు .



కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి దీనిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సంస్థలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ , రిస్క్ మేనేజ్‌మెంట్, మహిళల రక్షణ మరియు మెడికల్ పాలసీలను పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. భద్రత కోసం రూ.1.36 కోట్లు ఖర్చు చేశామని, 5,580 మంది ఉద్యోగులకు, 787 మంది కాంట్రాక్ట్ కార్మికులకు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో 'పెప్ టాక్', రైతులకు అవగాహన కోసం 5,340 'పొలంబాట' సమావేశాలు నిర్వహించడంతో పాటు, సురక్షితమైన లైన్ క్లియరెన్స్ కోసం కొత్తగా 'LC ఆండ్రాయిడ్ మొబైల్ యాప్'ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడంలో ప్రతి ఉద్యోగి కృషి ఉందని ఆయన కొనియాడారు.

## తెలంగాణ పోలీసులకు అంతర్జాతీయ ప్రశంసలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ పోలీసులకు అమెరికన్ కంపెనీ సీఈవో ధన్యవాదాలు తెలిపాడు.క్రిప్టో కరెన్సీ దిగ్గజం 'కాయిన్‌బేస్'పై జరిగిన భారీ హ్యాకింగ్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినందుకు గాను హైదరాబాద్ పోలీసులకు ఆ సంస్థ సీఈఓ బ్రియాన్ ఆర్మ్ స్ట్రాంగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన సైబర్ దాడిలో కస్టమర్ల డేటాను దొంగిలించేందుకు హ్యాకర్లు సంస్థ ప్రతినిధులకు భారీగా లంచాలు ఆశజూపారని, ఈ కుట్ర వల్ల సంస్థకు సుమారు 400 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ఈ అంతర్జాతీయ నేరంతో సంబంధం ఉన్న ఒక మాజీ ఏజెంట్‌ను తెలంగాణ పోలీసులు తాజాగా అదుపులోకి తీసుకున్నారు . బ్రియాన్ ఆర్మ్ స్ట్రాంగ్ మాట్లాడుతూ , హైదరాబాద్ పోలీసులకు ధన్యవాదాలని , హ్యాకర్లకు సహకరించే వారెవరికైనా ఇదే గతి పడుతుందని ఆయన ట్వీట్ చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా దర్యాప్తు సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా కాయిన్‌బేస్ స్పష్టం చేసింది.



## దక్షిణ తెలంగాణకు అన్యాయం జరిగింది

**నాగర్ కర్నూల్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినంత వేగంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తి చేసి ఉంటే, నేడు దక్షిణ తెలంగాణలో ఎన్నికల ఫలితాలు మరోలా ఉండేవని జాగృతి అధ్యక్షురాలు కవిత అభిప్రాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 'జాగృతి జనం బాట' శనివారం జరిగిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ ,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా నది 300 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నప్పటికీ, తెలంగాణ వాటాగా రావాల్సిన 550 టీఎంసీలలో కనీసం 299 టీఎంసీలను కూడా సరిగా వినియోగించుకోలేకపోయామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 25 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే, కేవలం 6.5 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లివ్వడం గొప్పతనమా అని బీఆర్ఎస్ నేతలను ఆమె ప్రశ్నించారు. 2015లో రూ.35,200 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు వ్యయం నేడు రూ.58 వేల కోట్లకు చేరినా, కాలువల వ్యవస్థ సిద్ధం కాకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెబుతున్నా, పనుల్లో జాప్యం జరుగుతోందని కవిత విమర్శించారు . గత ప్రభుత్వ హయాంలో దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులకు సరైన ప్రాధాన్యత లభించలేదన్న కోణంలో కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.



## నేడు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

జాతీయ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించి, 'వీబీ జీ రామ్ జీ' పేరుతో కొత్త చట్టాన్ని తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఆదివారం తెలంగాణవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీ విగ్రహాల వద్ద ఆయన చిత్రపటాలను పట్టుకొని ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కాంగ్రెస్ శ్రేణులను ఆదేశించారు. గ్రామీణ పేదల కూలీలకు భరోసాగా ఉన్న ఈ పథకాన్ని నీరుగార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే ఈ పేరు మార్పు అని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని, పార్టీ నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నిరసనలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## నేరాల నియంత్రణలో సక్సెస్

- 2025 వార్షిక నివేదిక విడుదల

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

నగరంలో నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ మెరుగైన ఫలితాలు సాధించిందని, గత ఏడాదితో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 15 శాతం తగ్గిందని నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ వెల్లడించారు. వార్షిక నేర నివేదికను శనివారం విడుదల చేసిన ఆయన, సైబర్ నేరాలు 8 శాతం, మహిళలపై నేరాలు 6 శాతం తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ముఖ్యంగా హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్ కేసులతో పాటు ఆస్తి వివాదాల్లోనూ గణనీయమైన తగ్గుదల నమోదైందని, ఇది పోలీసుల సమర్థ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత నగరం కోసం, వచ్చే ఏడాది నుంచి జోనల్ వారీగా నార్కోటిక్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, నూతన సంవత్సర వేడుకల వేళ మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## రాశి ఫలాలు

**28-12-2025 ఆదివారం**

**మేషం:**
ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది. చిన్ననాటి స్నేహితులతో ఎంజాయ్ చేస్తారు. మంచి పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగంలో అధికారుల నమ్మకాన్ని చూరగొంటారు. వృత్తి, వ్యాపా రాలు బాగా బిజీగా సాగిపోతాయి. కుటుంబ వ్యవహారాల్లో కొద్దిగా ఒత్తిడి ఉంటుంది. ఇతరుల వ్యవహారాల్లో కల్పించుకోకపోవడం మంచిది. నిరుద్యోగులకు ఆశించిన సమాచారం అందుతుంది.

**వృషభం:**
వ్యక్తిగత, ఆర్థిక సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయి. కొన్ని ముఖ్యమైన వ్యవహారాలు పూర్తయి, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. గృహ, వాహన సౌకర్యాల మీద దృష్టి కేంద్రీకరిస్తారు. ఇష్టమైన ప్రాంతానికి స్థాన చలనం జరిగే అవకాశం ఉంది. ఆదాయ మార్గాలు సత్ఫలితాలనిస్తాయి. వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాల్లో లాభాలు నిలకడగా పురోగమిస్తాయి.

**మిథునం:**
ఆశించిన శుభవార్తలు వింటారు. ఆదాయ వృద్ధికి సంబంధించి ఎలాంటి ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. బంధువుల ద్వారా పెళ్లి సంబంధం కుదిరే అవకాశం ఉంది. వృత్తి, ఉద్యోగాల్లో మీ కృషికి, మీ ప్రతిభకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. వ్యాపారాలు స్థిరంగా పురోగమిస్తాయి. జీవిత భాగస్వామికి చిన్నపాటి అదృష్టం పడుతుంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

**కర్కాటకం:**
కుటుంబంలో సుఖ సంతోషాలకు లోటుండదు. ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది. అదనపు ఆదాయ మార్గాలు ఆశించిన ఫలితాలనిచ్చే అవకాశం ఉంది. ఆదాయంలో ఆశించిన పెరుగుదల కనిపిస్తుంది. వృత్తి, వ్యాపారాలు నిలకడగా ముందుకు సాగుతాయి. వ్యక్తిగత సమస్య ఒకటి పరిష్కారం అవుతుంది. వృత్తి, ఉద్యోగ బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వర్తిస్తారు.

**సింహం:**
ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా చక్కబెడతారు. ఆదాయానికి లోటుండకపోవచ్చు. కొందరు మిత్రుల వల్ల ఆర్థికంగా నష్టపోతారు. వృత్తి, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగిపోతాయి కానీ, వ్యాపారాల్లో పోటీదార్ల నుంచి ఇబ్బందులు ఉంటాయి. కుటుంబ సభ్యుల మీద ఖర్చులు పెరుగుతాయి. స్వల్ప అనారోగ్యానికి అవకాశం ఉంది.

**కన్య:**
మంచి పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా చక్కబెడతారు. ఆదాయానికి లోటుండకపోవచ్చు. కొందరు మిత్రుల వల్ల ఆర్థికంగా నష్టపోతారు. వృత్తి, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగిపోతాయి కానీ, వ్యాపారాల్లో పోటీదార్ల నుంచి ఇబ్బందులు ఉంటాయి. కుటుంబ సభ్యుల మీద ఖర్చులు పెరుగుతాయి.

**తుల:**
రోజంతా శుభ వార్తలతో సాగిపోతుంది. ఏ పని ప్రారంభించినా, ఏ ప్రయత్నం తలపెట్టినా తప్పకుండా విజయవంతం అవుతాయి. ఆదాయం ఆశించినంతగా పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ప్రాభవం, ప్రాధాన్యం కొనసాగుతాయి. అధికార బాధ్యతలు నిర్వహించడం జరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు లాభసాటిగా, సంతృప్తికరంగా సాగిపోతాయి. ఉద్యోగంలో స్థిరత్వం లభిస్తుంది. ఆదాయం అనుకూలంగా ఉంటుంది. ముఖ్యమైన ప్రయత్నాలు సఫలం అవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో విజయాలు సాధిస్తారు. కుటుంబ సమస్యల్ని సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటారు.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాల్లో ఆశించిన పురోగతి చోటు చేసుకుంటుంది. ఉద్యోగంలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రతిభా పాటవాలకు వృత్తి, ఉద్యోగాల్లోనే కాకుండా, సామాజికంగా కూడా మంచి గుర్తింపు లభిస్తుంది. ఆదాయ ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తాయి. రాదనుకుని వదిలేసుకున్న డబ్బు కొద్ది ప్రయత్నంతో చేతికి అందుతుంది.

**మకరం:**
అదనపు ఆదాయ మార్గాలు మంచి ఫలితాలనిస్తాయి. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగంలో బరువు బాధ్యతలు పెరిగినప్పటికీ, ఆశించిన ప్రతిఫలం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో కార్యకలాపాలు బాగా పెరుగుతాయి. అనారోగ్యాల నుంచి బాగా కోలుకుంటారు. రావాల్సిన డబ్బు చేతికి అందుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి.

**కుంభం:**
ఆశించిన ప్రతిఫలం ఉన్నప్పటికీ, వృత్తి, ఉద్యోగాల్లో పనిభారం పెరిగి ఇబ్బంది పడతారు. వ్యాపా రాలు కొద్దిపాటి లాభాలతో పురోగమిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగా చక్కబడతాయి. వ్యక్తిగత సమస్యలు కొద్దిగా ఒత్తిడికి గురి చేస్తాయి. కొందరు బంధుమిత్రుల వల్ల ఆర్థికంగా నష్టపోతారు. మాటకు, చేతకు విలువ పెరుగుతుంది.

**మీనం:**
ఉద్యోగంలో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. వృత్తి, ఉద్యోగాల్లో ప్రతిభా పాటవాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. జీతభత్యాలకు సంబంధించి శుభవార్తలు వింటారు. వ్యాపారాల్లో రాబడి వృద్ధి చెందుతుంది. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఆర్థికంగా బాగా కలిసివస్తుంది. కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయి.

## గర్భిణీలకు శీతాకాలంలో వైద్యుల హెచ్చరిక

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



గర్భధారణ సమయంలో వాతావరణ పరిస్థితులు శిశువు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్న విషయం మరోసారి పరిశోధనల ద్వారా వెల్లడైంది. వాతావరణంలో చలి తీవ్రంగా ఉన్నప్పుడు కొన్ని సందర్భాల్లో పుట్టిన శిశువు బరువు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఉష్ణోగ్రతలో నిరంతర తగ్గుదల గర్భంలోని శిశువు అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని పరిశోధకులు చెబుతున్నారు. గర్భంతో ఉన్న సమయంలో రెండవ, మూడవ నెలలు అత్యంత కీలక దశగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సమయంలో ఎదురయ్యే పర్యావరణ పరిస్థితులు, ముఖ్యంగా చలి తీవ్రత, శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశముందని అధ్యయనాలు వెల్లడించాయి. అయితే ఇది ప్రతి గర్భిణికి ఒకేలా వర్తించదని, పర్యావరణం, తల్లి ఆరోగ్య పరిస్థితులు, పోషణ స్థాయి వంటి అంశాలపై ఇది ఆధారపడి ఉంటుందని పరిశోధకులు స్పష్టం చేశారు. డేటా ఆధారంగా చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జన్మించిన కొంతమంది శిశువులు సాధారణం కంటే తక్కువ బరువుతో పుట్టినట్లు గుర్తించారు. పరిశోధనల ప్రకారం అలాంటి శిశువుల్లో ఇన్ఫెక్షన్లకు త్వరగా గురయ్యే ప్రమాదం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, శరీర బలహీనత, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సమస్యలు, కొన్ని సందర్భాల్లో పెరుగుదల సమస్యలు కనిపిస్తాయి. అయితే గర్భధారణ సమయంలో సరైన సంరక్షణ తీసుకుంటే ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని డాక్టర్లు స్పష్టం చేశారు.

శీతాకాలంలో గర్భంతో ఉన్న మహిళలు ప్రత్యేకంగా ఈ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

- శరీరాన్ని ఎల్లప్పుడూ వెచ్చగా ఉంచుకోవాలి.
- సమతుల్యమైన, పోషకాహారం తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా డాక్టర్ వద్ద తనిఖీలు చేయించుకోవాలి.
- తగినంత విశ్రాంతి తీసుకోవాలి, కంటినిండా నిద్ర పోవాలి.
- జలుబు, ఫ్లూ లేదా ఇతర అనారోగ్యాలను నిర్లక్ష్యం చేయకూడదు.

వాతావరణ ప్రభావాలను పూర్తిగా నివారించలేకపోయినా, సకాలంలో వైద్య సలహాలు తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గర్భధారణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల శిశువు ఆరోగ్యంగా జన్మించే అవకాశాలు మరింత పెరుగుతాయని చెబుతున్నారు.

## తుపాకీ పట్టుకుని అడవిలోకి వెళ్తావా?

- ప్రకాశ్ రాజ్ పై బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి నిప్పులు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ , మావోయిస్టుల అంశంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. ఎక్స్ వేదికగా ప్రకాశ్ రాజ్‌పై శనివారం విమర్శల వర్షం కురిపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సినిమా డైలాగులతో చరిత్రను వక్రీకరించడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఆర్ఎస్ఎస్ కు స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర లేదన్న ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. "1921లో జైలుకు వెళ్లిన డాక్టర్ హెడ్గేవార్ చరిత్ర మీకు తెలుసా? సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్ ను బ్యాన్ చేశారని చెబుతున్నారు కానీ, ఆధారాలు లేవని తేలాక ఆయనే స్వయంగా బ్యాన్ తొలగించిన విషయం విస్మరించారు. ఆర్ఎస్ఎస్ లో మహిళలు లేరనడం మీ అజ్ఞానం. 'రాష్ట్ర సేవికా సమితి' ద్వారా గత 50 ఏళ్లుగా లక్షలాది మంది మహిళలు దేశ సేవలో పాల్గొంటున్నారు" అని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఏ విపత్తు సంభవించినా ప్రాణాలకు తెగించి సేవ చేసేది RSS కార్యకర్తలేనని ఆయన గుర్తు చేశారు. మావోయిస్టుల పట్ల ప్రకాశ్ రాజ్ చూపిస్తున్న సానుభూతిపై విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. "2000 నుంచి 2025 వరకు మావోయిస్టుల దాడుల్లో సుమారు 2,722 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు మీ గొంతు ఎందుకు మూగబోయింది? తుపాకీ హింసను వీడాలని మాజీ మావోయిస్టు నేతలే చెబుతుంటే, మీరు మాత్రం వారిని రెచ్చగొడుతున్నారు. అంతగా హింసపై మక్కువ ఉంటే మీరే తుపాకీ పట్టుకుని అడవిలోకి వెళ్లవచ్చు కదా? లేదా మీ పిల్లల్ని పంపుతారా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. పేద గిరిజన తండాల్లోని ఆదివాసీల జీవితాలను హింస వైపు మళ్లించి నాశనం చేయవద్దని ప్రకాశ్ రాజ్‌కు ఆయన హెచ్చరిక జారీ చేశారు. ఇలాంటి చర్యలను కొనసాగిస్తే చరిత్ర మిమ్మల్ని క్షమించదని విష్ణువర్ధన్ రెడ్డి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మేధావి ముసుగులో విచ్ఛిన్నకర శక్తులకు మద్దతు తెలపడం ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

## సీఎం ఇలాకాలో 'మరణ' మృదంగం!

**మొదటిపేజీ తరువాయి...**

మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో రాములు నివాసానికి చేరుకున్న కేంద్ర మంత్రికి నిరసన సెగ తగిలింది. "ఇంకా ఎంతమందిని చంపుదామని వస్తున్నారు? మా పచ్చని పొలాలు లాక్కుని, ఇప్పుడు మమ్మల్ని ఇళ్లు లేని వారిని చేస్తున్నారు. మీ దొంగ సానుభూతి మాకొద్దు, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోండి" అంటూ రైతులు, బాధితుడి బంధువులు మంత్రిని కడిగిపారేశారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అండతోనే ఈ అన్యాయం జరుగుతోందని బాధితులు ఆగ్రహంతో ఊగిపోయారు. మృతుడు రాములు కుమారుడు సుదర్శన్ కేంద్ర మంత్రి ముందే విరుచుకుపడ్డారు. "మా నాన్నది సహజ మరణం కాదు.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే! ఆయన పడుతున్న ఆవేదనను మీరు పట్టించుకోకపోవడం వల్లే ఆయన ప్రాణాలు పోయాయి" అని వాపోవడంతో అక్కడ విషాదఛాయలు అలముకున్నాయి. రైతులు తమ ఐదెకరాల పొలాన్ని పూలింగ్‌లో ఇచ్చామని, ఇప్పుడు ఉన్న ఇంటిని కూడా రోడ్డు కోసం తొలగిస్తూ తమను రోడ్డున పడేశారని మంత్రులను నిలదీశారు. ప్రభుత్వ తీరుపై రైతులు నిప్పులు చెరిగారు. "మా దగ్గర పచ్చని పొలాలు తీసుకుని, మాకు బురద గుంటల్లో ఇళ్ల స్థలాలు ఇస్తారా? అంతగా కావాలంటే ఆ గుంటల్లో మీరు ఇళ్లు కట్టుకుని ఉంటారా?" అని మంత్రి చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన మెరక ప్రాంతంలో ప్లాట్లు ఇవ్వాలని కోరుతుంటే, ప్రభుత్వం మాత్రం ఎస్టీ కాలనీ సమీపంలో మునిగిపోయే ప్రాంతాల్లో ప్లాట్లు ఇస్తామనడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కేంద్ర మంత్రి చంద్రశేఖర్ వెళ్లిపోయిన కొద్ది సేపటికే రాష్ట్ర మంత్రి పి. నారాయణ రాములు కుటుంబాన్ని పరామర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్లో మాట్లాడించినప్పటికీ, బాధిత కుటుంబానికి అందాల్సిన పరిహారం లేదా మెరక ప్రాంతంలో ప్లాట్ల కేటాయింపుపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. "పరిశీలిస్తాం" అనే పాత మాటలతోనే మంత్రులు కాలక్షేపం చేస్తుండటంతో రైతులు మరింత ఆవేదనకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం గ్రామం మధ్యలో ఉన్న 147 ఇళ్లను తొలగించాలని సీఆర్డీఏ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు మందడంలో ముసలం పుట్టించింది. ఆలయాలను కాపాడలేక, ఇళ్లను కూల్చివేయడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సొంత గ్రామంలోనే రైతుల మధ్య విభేదాలు సృష్టిస్తూ, గ్రూపుల రాజకీయం చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందని రైతులు మండిపడుతున్నారు.

## ఐఏఎస్ కావాలనుకున్నా... కానీ, నన్ను సీఎంను చేశారు!

**మొదటిపేజీ తరువాయి...**

తన సతీమణి నారా భువనేశ్వరి నిర్వహించిన బహుముఖ పాత్రలను చంద్రబాబు కొనియాడారు. "నేను రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పుడు ఆమె అయిష్టంగానే హెరిటేజ్ బాధ్యతలు తీసుకున్నారు. కానీ తన పట్టుదలతో ఆ సంస్థను గొప్ప స్థాయికి తీసుకెళ్లారు. టెక్నాలజీ గురించి నేను చెబుతుంటే, ఆమె దానిని ఆచరణలో పెట్టి ట్యాబ్ చూసి ప్రసంగిస్తున్నారు. భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా ఆమె సక్సెస్ అయ్యారు. ఆమె కృషికి గుర్తింపుగా లండన్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్' నుండి గోల్డెన్ పీకాక్ అవార్డు రావడం గర్వకారణం" అని అభినందించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని చంద్రబాబు హితవు పలికారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, సంస్కారం, విలువలు ఉంటేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. "సాంకేతికతను అందిపుచ్చుకుని పేదరికాన్ని జయించాలి. పేదరికం పోతే సంపద దానంతట అదే వస్తుంది. తెలుగుదేశం పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన కార్యకర్తల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే ఈ సంస్థల ప్రధాన ఉద్దేశం" అని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చంద్రబాబు దంపతులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించిన తర్వాత వారు విద్యా సంస్థ ప్రాంగణంలో కలియతిరుగుతూ పాత స్మృతులను నెమరువేసుకున్నారు.

## జర్నలిస్టుల 'కలం కవాతు'


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 252ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు లోకం భగ్గుమంది. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, టీజేఎఫ్ పిలుపు మేరకు శనివారం 33 జిల్లాల్లో 'కలం కవాతు' నిర్వహించి, కలెక్టరేట్లను ముట్టడించారు. డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్లను రద్దు చేయడం, గుర్తింపు కార్డుల సంఖ్యను కుదించడాన్ని నిరసిస్తూ జర్నలిస్టులు భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన యూనియన్ రాష్ట్ర నేతలను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ నాయకత్వంలో జర్నలిస్టులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు మారుతి సాగర్, రమేష్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, అవ్వారి భాస్కర్ సహా పలువురు నేతలను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జర్నలిస్టుల అరెస్టులను టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ తీవ్రంగా ఖండించారు. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన నేతలను పరామర్శించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు తెలంగాణ ఉద్యమం కోసం పనిచేసిన జర్నలిస్టులను నేడు రెండో శ్రేణి పౌరులుగా చూడటం దుర్మార్గమని , గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేశారని , కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉన్న గుర్తింపును కూడా రద్దు చేస్తోందని మండిపడ్డారు. డెస్క్ జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్న వివాదాస్పద జీవో 252ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, పాత జీవో 239 స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వైఖరిని నేతలు తప్పుబట్టారు. జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదని, అక్రిడిటేషన్ అనేది కేవలం గుర్తింపు మాత్రమేనని, దానివల్ల ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే, భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మారుతి సాగర్, రమేష్ హజారి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ ఆందోళనలకు మేధావులు, రాజకీయ నాయకులు , ప్రజాస్వామికవాదులు తమ మద్దతును ప్రకటించారు.

## నింగికెగిసిన హేతువాది 'చార్వాక' పత్రిక రథసారథి


**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



తెలుగు రాష్ట్రాల్లో హేతువాద ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి సామాన్యుడి ముంగిటకు చేర్చిన 'చార్వాక' పత్రిక రథసారథి తోటకూర వెంకటేశ్వర్లు అస్తమయంతో ఏపీలో హేతువాదంలో అధ్యాయం ముగిసింది. గుంటూరులో శుక్రవారం తెల్లవారుజామున ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. బతుకులోనే కాకుండా మరణంలోనూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. బాపట్ల జిల్లా సంతరావూరు గ్రామానికి చెందిన తోటకూర వెంకటేశ్వర్లు విద్యాభ్యాసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగింది. బ్యాంకు ఉద్యోగిగా ప్రస్థానం మొదలుపెట్టి, సహకార రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం శ్రమించి, వ్యవస్థలోని లోపాలను ఎదిరిస్తూ ఒంటరిగా సుప్రీంకోర్టు వరకు పోరాడిన ఆ ధీశాలి ప్రస్థానం నేటితరానికి ఒక గొప్ప పాఠం. చిన్నతనంలోనే హేతువాద ప్రభావానికి లోనైన ఆయన ఆ తర్వాతి కాలంలో హేతువాద ఉద్యమాన్నే నడిపారు. 1970వ దశకంలో హేతువాద ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న కాలంలో, ప్రపంచ ప్రసిద్ధ హేతువాది ఏటీ కోవూరు స్ఫూర్తితోనే వెంకటేశ్వర్లు తెలుగు సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలడానికి 'చార్వాక' పత్రికను ఆయుధంగా ఎంచుకున్నారు. వ్యక్తులు వ్యవస్థలపై పోరాటం చేయడమంటే కత్తి మీద సామె. ఇంటా బయట అవమానాలు, మొండివాడు అనే ముద్రలు వేయించుకోవడమే. తోటకూర జీవితంలోనూ అదే జరిగింది. ఆయనది నిఖార్సైన పోరాటం. ఆయన నిజాయితీ ఎంతటిదంటే, తన పిల్లల్లో ఒకరి పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కోసం లంచం అడిగిన కానిస్టేబుల్‌కు డబ్బు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆ కానిస్టేబుల్ ఆ అడ్రసు అసలు లేనే లేదని చెప్పి మూడేళ్లు జాప్యం చేయించాడు. ఈ తరహా తీరు వల్ల తన పిల్లలు ఇబ్బంది పడినా ఆయన మాత్రం తన విలువలను వదులుకోలేదు. జీవితాంతం హేతుబద్ధంగా జీవించిన ఆయన, మరణం విషయంలోనూ అంతే స్పష్టతతో వున్నారు. తాను మరణించినపుడు ఆర్భాటాలు వద్దని, ఎవరికీ సమాచారం ఇవ్వవద్దని, కేవలం కుటుంబసభ్యుల సమక్షంలోనే అంత్యక్రియలు జరగాలని చెప్పి, ఆమేరకు కుటుంబసభ్యుల నుంచి మాట తీసుకున్నారు. కన్నీళ్లు, సంతాప సభల కంటే, నిశ్శబ్దంగా నిష్క్రమించడమే సరైనదని నమ్మిన తోటకూర వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయం.

## అభిమానులకు హీరో కీలక సూచనలు

**కౌలాలంపూర్ (ఏడీఎన్ఎన్) :**



తమిళ సూపర్‌స్టార్, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ నటించిన చివరి చిత్రం 'జననాయగన్' ఆడియో విడుదల వేడుకలో నినాదాలు చేసిన అభిమానులకు కీలక సూచనలు చేశారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వేదికపైకి విజయ్ రాగానే వేలాది మంది అభిమానులు ఒక్కసారిగా "టీవీకే.. టీవీకే.." అంటూ పార్టీ నినాదాలతో స్టేడియాన్ని హోరెత్తించారు. పార్టీ నినాదాలు మిన్నంటడంతో విజయ్ వెంటనే స్పందించారు. ఇది ఒక సినిమా వేడుక అని, ఇక్కడ రాజకీయ రంగు పులమకూడదని భావించిన ఆయన, తన చేతి సంజ్ఞతో నినాదాలను ఆపాలని అభిమానులను సున్నితంగా వారించారు.



## అంతర్జాతీయ సమ్మిట్‌కు కేటీఆర్

- ఇన్నోవేషన్ రంగంలో కృషికి గుర్తింపు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం లభించింది. వచ్చే ఏడాది జనవరి 9 నుంచి 11వ తేదీ వరకు దుబాయ్‌లో జరగనున్న 'గ్లోబల్ ఇన్నోవేషన్ సమ్మిట్' కు హాజరుకావాల్సిందిగా నిర్వాహకులు ఆయనకు ఆహ్వానం పంపారు. ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు నిర్వహించబడుతోంది. తెలంగాణ ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ స్టార్టప్ రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, నూతన ఆవిష్కరణలకు ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ ఆహ్వానం అందినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా టీహబ్ వంటి సంస్థల ద్వారా అంతర్జాతీయ స్థాయి ఆవిష్కరణలను ప్రోత్సహించిన విధానాన్ని ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రస్తావించారు. అట్టడుగు స్థాయి నుంచి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, గ్రామీణ యువతకు ఆవిష్కరణా సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా వారిని శక్తివంతులుగా మార్చడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యం. ఈ సమ్మిట్‌లో కేటీఆర్ పాల్గొనడం వల్ల అంతర్జాతీయ వేదికపై తెలంగాణ యొక్క అభివృద్ధి నమూనా హైలైట్ కావడమే కాకుండా, యువ ఆవిష్కర్తలకు కొత్త స్ఫూర్తినిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## దుర్గమ్మ కొండపై విద్యుత్ సెగ

- 3 కోట్ల బకాయిల కోసం కరెంట్ కట్ చేసిన అధికారులు

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

విజయవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై శనివారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దేవాదాయ, విద్యుత్ శాఖల మధ్య నెలకొన్న బకాయిల వివాదం కారణంగా కనకదుర్గమ్మ ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుర్గగుడి దేవస్థానం రూ. 3.08 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలను చెల్లించాల్సి ఉందని ఏపీసీపీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో అధికారులు ఆలయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేయగా, మధ్యాహ్నం 2 గంటల వరకు మూడున్నర గంటల పాటు ఈ కోత కొనసాగింది. ఈ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఆయన వెంటనే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఇద్దరు మంత్రుల మధ్య జరిగిన చర్చల తర్వాత , ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అమ్మవారి అంతరాలయం, దర్శన క్యూలైన్లు, లిఫ్టుల వద్ద ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు జనరేటర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో భక్తులకు పెద్దగా ఇబ్బంది కలగలేదు. అయితే, బకాయిల విషయంలో దుర్గగుడి అధికారులు తమ వాదనను బలంగా వినిపిస్తున్నారు. సోమవారం ఉన్నతాధికారులతో చర్చించి కొంత మేర బకాయిలు చెల్లించేందుకు సిద్ధమైనప్పటికీ, సోలార్ ప్లాంట్ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఆలయంలో ఉన్న సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానిస్తున్న విద్యుత్ యూనిట్ల లెక్కలను సరిచూడాలని, వాటిని మొత్తం బిల్లుల నుండి మినహాయించాలని దేవస్థానం అధికారులు పట్టుబడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల ఇలాంటి ఘటనలు జరగడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**చిలకలూరిపేట (ఏడీఎన్ఎన్) :**



చిలకలూరిపేట రూరల్ మండల పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. బొప్పూడి గ్రామ పరిధిలోని ఒక కళ్యాణ మండపం పక్కన ఉన్న డాబా ఇంటిలో 'కోత ముక్క' పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీనిపై స్పందించిన రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్, తన సిబ్బందితో కలిసి సదరు నివాసంపై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతూ దొరికిపోయిన 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీల్లో నిందితుల వద్ద నుండి పెద్ద ఎత్తున నగదు , ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1,25,700 నగదుతో పాటు, ఆరు స్మార్ట్ ఫోన్లు , రెండు కార్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. అరెస్టయిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మండల పరిధిలో ఎక్కడైనా ఇటువంటి అక్రమ వ్యాపారాలు లేదా జూదం నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ అనిల్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఎట్టకేలకు ఒక్క మ్యాచ్ గెలిచిన ఇంగ్లాండ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బాక్సింగ్ డే టెస్టులో ఎట్టకేలకు ఇంగ్లాండ్ మొదటి విజయం సాధించింది. ఆస్ట్రేలియాపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. 175 పరుగుల లక్ష్యాన్ని కేవలం 32.2 ఓవర్లలో ఛేదించింది. ఆరు వికెట్లు కోల్పోయింది. ఐదు టెస్టుల యాషెస్ సిరీస్ లో ఆస్ట్రేలియా ఇప్పటికే మూడు టెస్టులు గెలిచి సిరీస్ చేజిక్కించుకుంది. నాల్గవ టెస్టులో ఇంగ్లాండ్ గెలుపొందింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 152 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ 110కే కుప్పకూలింది. సెకండ్ ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 132 పరుగులకే పరిమితమయ్యింది.



## దోహాలో చెస్ ర్యాపిడ్‌లో అర్జున్-గుకేశ్ అగ్రస్థానం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేశి, ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ అద్భుతంగా ఆరంభించారు. ర్యాపిడ్ విభాగంలో అయిదు రౌండ్లు ముగిసే సరికి ఈ ఇద్దరూ చెరో 4.5 పాయింట్లు సాధించి, నార్వే స్టార్ మాగ్నస్ కార్ల్సన్ (4.5) తో కలిసి అగ్రస్థానంలో నిలిచారు. తొలి నాలుగు గేముల్లో వరుస విజయాలు సాధించిన అర్జున్ ఇరిగేశి, అయిదో రౌండ్‌లో కార్ల్సన్‌ను డ్రాగా నిలువరించి తన జోరును కొనసాగించాడు. మరోవైపు గుకేశ్ కూడా తొలి నాలుగు గేముల్లో నెగ్గి, ఒక గేమ్‌ను డ్రాగా ముగించాడు. భారత యువ చెస్ శక్తి ఈ టోర్నీలో గట్టిగా వినిపిస్తోంది. తొలి నాలుగు గేముల్లో రెండు విజయాలు, రెండు డ్రాలతో ప్రజ్ఞానంద 3 పాయింట్లు గెలుచుకున్నారు. మూడు గేముల్లో విజయం, ఒక గేమ్‌లో పరాజయంతో నిహాల్ సరీన్ 3 పాయింట్లు గెలుచుకున్నారు. మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక దూకుడు ప్రదర్శించింది. మహిళల విభాగంలో నాలుగు రౌండ్లు పూర్తయ్యే సరికి హారిక 3.5 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచింది. ఆమె మూడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను డ్రాగా ముగించింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోనేరు హంపి రెండు విజయాలు సాధించి, రెండు గేములను డ్రాగా ముగించి 3 పాయింట్లు గెలుచుకుంది. వైశాలి మూడు గేముల్లో గెలిచి, ఒకటిలో ఓటమి పాలయి 3 పాయింట్లు సాధించింది. దివ్య దేశముఖ్ రెండు గేముల్లో విజయం సాధించి, రెండింటిని డ్రాగా ముగించి 3 పాయింట్లు సాధించింది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో ఓపెన్ విభాగంలో 13 గేమ్స్, మహిళల విభాగంలో 11 గేమ్స్ నిర్వహించనున్నారు. అత్యధిక పాయింట్లు సాధించిన ఆటగాళ్లే విజేతలుగా నిలుస్తారు. దోహాలో కొనసాగుతున్న ఈ పోరులో భారత గ్రాండ్‌మాస్టర్ల ప్రదర్శనపై ప్రపంచ చెస్ వర్గాలు ఆసక్తిగా దృష్టిసారించాయి.



## గొప్ప మనసు చాటుకున్న నీతా అంబానీ

- ఒకేచోట అత్యాధునిక వైద్య సేవలు
- రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ ద్వారా కోట్లమందికి సేవలు
- తండ్రి స్మృతికి అంకితం చేసిన నీతా అంబానీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్పర్సన్ నీతా అంబానీ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ముంబయిలోని సర్ హెచ్.ఎన్. రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్‌లో 'జీవన్' పేరిట కొత్త వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈ విభాగం ద్వారా క్యాన్సర్, డయాలసిస్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు ఒకేచోట అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తన భర్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీతో కలిసి ఆమె ప్రారంభించారు. 'జీవన్' విభాగాన్ని నీతా అంబానీ తన తండ్రి రవీంద్రభాయ్ దలాల్‌కు అంకితమిచ్చారు. తోటివారిపై దయ, సేవాదృక్పథంతో జీవించాలని తన తండ్రి తనకు నేర్పించారని ఆమె భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ విశేషాలతో కూడిన వీడియోను కూడా ఆమె పంచుకున్నారు. ఈ కొత్త విభాగంలో అత్యాధునిక కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, డయాలసిస్ వంటి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని నీతా అంబానీ తెలిపారు. ముఖ్యంగా చిన్నారుల కోసం ప్రత్యేకంగా పీడియాట్రిక్ కీమోథెరపీ వార్డ్ ఏర్పాటు చేయడం విశేషం. క్యాన్సర్ చికిత్సలో పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ విభాగాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ ద్వారా ఇప్పటివరకు 33 లక్షల మంది రోగులకు, అలాగే 16 లక్షల మంది చిన్నారులకు వైద్య సేవలు అందించినట్లు నీతా అంబానీ వెల్లడించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించడమే రిలయన్స్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. 'జీవన్' విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా చిన్న పిల్లలు మెరుగైన ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తుపై నమ్మకంతో తిరిగి వెళ్లాలన్నదే మా సంకల్పం" అని నీతా అంబానీ పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో రిలయన్స్ ఫౌండేషన్ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమం, దేశంలో ఆధునిక వైద్యాన్ని మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించనుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## శ్రీలంక పై టీమిండియా జైత్రయాత్ర

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



- మూడో టీ20లో 8 వికెట్ల తేడాతో సంచలన విజయం
- షెఫాలీ వర్మ సిక్సర్ల జాతర
- రేణుకా సింగ్, దీప్తి శర్మ దెబ్బకు లంక ప్లేయర్లు బెంబేలు

శ్రీలంకపై భారత్ మహిళల జైత్రయాత్ర కొనసాగిస్తోంది. మూడో టీ20లో కూడా 8 వికెట్ల ఘన విజయం సాధించి, సిరీస్ క్లీన్ స్వీప్ చేసేసింది. తిరువనంతపురం వేదికగా శుక్రవారం శ్రీలంకతో జరిగిన మూడో టీ20లో టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 30 ఆధిక్యంతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. బౌలింగ్‌లో రేణుకా సింగ్ ఠాకూర్, దీప్తి శర్మ చెలరేగగా.. బ్యాటింగ్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ సిక్సర్లతో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్‌కు బౌలర్లు అద్భుత ఆరంభాన్ని అందించారు. ఏడాది తర్వాత టీ20ల్లోకి రీ ఎంట్రీ ఇచ్చిన పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ 4 ఓవర్లలో 21 పరుగులకు 4 వికెట్లు తీసి సంచలనం సృష్టించింది. తన షార్ప్ బంతులతో శ్రీలంక టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. మరోవైపు స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ (3/18) కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ ఇద్దరి ధాటికి శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి కేవలం 112 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టిన దీప్తి శర్మ మహిళల టీ20 క్రికెట్ చరిత్రలో అరుదైన ఘనతను సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆస్ట్రేలియాకు చెందిన మేగాన్ షట్‌తో కలిసి సంయుక్తంగా తొలి స్థానంలో నిలిచింది. దీప్తి ఖాతాలో ప్రస్తుతం 151 వికెట్లు ఉన్నాయి. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ బౌలర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. 113 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్ షెఫాలీ వర్మ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను తేల్చేసింది. స్మృతి మంధాన (1), జెమీమా రోడ్రిగ్స్ (9) త్వరగానే అవుట్ అయినా, షెఫాలీ మాత్రం తగ్గలేదు. కేవలం 42 బంతుల్లోనే 11 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సాయంతో అజేయంగా 79 పరుగులు చేసి శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (21 నాటౌట్)తో కలిసి ఆమె కేవలం 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో లంక టాప్ ఆర్డర్‌ను ఛిద్రం చేసిన రేణుకా సింగ్ ఠాకూర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ గెలుపుతో భారత్ మహిళల జట్టు సిరీస్‌లో తన ఆధిపత్యాన్ని స్పష్టంగా చాటింది.

## బీసీసీఐపై రో-కో అభిమానులు ఫైర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**





- బీసీసీఐపై అభిమానుల ఆగ్రహం
- ప్రత్యక్ష ప్రసారం లేదు.. స్ట్రీమింగ్ కూడా కాదు
- కోహ్లీ మ్యాచ్‌కు అభిమానులకు అనుమతి లేదు

స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు దేశవాళీ క్రికెట్ విజయ్ హజారే ట్రోఫీలో కూడా అదే దూకుడుతో ఆడటాన్ని చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే బీసీసీఐపై మాత్రం ఫైర్ అవుతున్నారు. ఈ మ్యాచ్‌ల కోసం బీసీసీఐ చేసిన పేలవమైన ఏర్పాట్లు మాత్రం వారికి తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. అభిమానులను ఎక్కువగా నిరాశపరిచిన అంశం ఏమిటంటే, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడిన మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయకపోవడం. టీవీ ప్రసారం మాత్రమే కాదు, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ సౌకర్యం కూడా అందుబాటులో లేకపోయింది. టోర్నమెంట్ తొలి రౌండ్‌లో కేవలం కొన్ని ఎంపిక చేసిన మ్యాచ్‌లకే ప్రసారం ఏర్పాటు చేయగా, స్టార్ ఆటగాళ్లు పాల్గొన్న మ్యాచ్‌లను పూర్తిగా విస్మరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో భారత స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అదరగొట్టారు. ముంబై తరఫున బరిలోకి దిగిన రోహిత్ శర్మ సిక్కింపై అద్భుతమైన 155 పరుగుల ఇన్నింగ్స్ ఆడి జట్టుకు కీలక విజయాన్ని అందించాడు. మరోవైపు ఢిల్లీ జట్టు తరఫున ఆడిన విరాట్ కోహ్లీ ఆంధ్రప్రదేశ్‌పై శతకం సాధించి తన క్లాస్ ఏంటో మరోసారి చాటిచెప్పాడు. ఈ ఇద్దరి ఇన్నింగ్స్ లు ఆయా జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించాయి. విరాట్ కోహ్లీ ఆడిన మ్యాచ్‌కు అభిమానులను స్టేడియంలోకి అనుమతించలేదు. కోహ్లీని ప్రత్యక్షంగా చూడాలని ఆశపడ్డ వేలాది మంది అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. జైపూర్‌లో రోహిత్ శర్మ ఆడిన మ్యాచ్‌కు మాత్రం అభిమానులను అనుమతించారు. అయితే గ్యాలరీల్లో దూరంగా కూర్చునేలా ఏర్పాట్లు చేయడంతో, అభిమానులు ఆటను స్పష్టంగా చూడలేక స్కోర్‌బోర్డ్ అప్‌డేట్స్ పైనే ఆధారపడాల్సి వచ్చింది. దీనితో వారంతా పూర్తి నిరాశకు గురయ్యారు. దేశవాళీ క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించాల్సిన బాధ్యత బీసీసీఐపై ఉన్నప్పటికీ, ఈ తరహా నిర్లక్ష్య ధోరణి సరైనదేనా? అనే ప్రశ్నలు ఇప్పుడు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అలాంటి మ్యాచ్‌లను ప్రసారం చేయకుండా, అభిమానులను స్టేడియాలకు దూరం పెట్టడం దేశవాళీ క్రికెట్ అభివృద్ధికే అడ్డంకిగా మారుతోందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. స్టార్ ఆటగాళ్ల మెరుపులతో మైదానం వెలిగినప్పటికీ, సరైన ఏర్పాట్లు లేక అభిమానులకు ఆ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించే అవకాశం దక్కకపోవడం ఈ మ్యాచ్‌లపై పెద్ద మచ్చగా మిగిలింది.

## నెలరోజుల్లో రూ.80 వేల జంప్.. వెండి జిలుగులు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**







- కిలో వెండి రూ.2.50 లక్షలు
- బంగారానికి చరిత్రలోనే భారీ లాభం
- ఇంకా కొనసాగనున్న ధరల పరుగు

నగరంలో వెండి, బంగారం ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరింది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.80 వేల పెరుగుదల నమోదు కావడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. మార్కెట్‌లో గిరాకీకి తగ్గట్లుగా వెండి సరఫరా లేకపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. రానున్న రోజుల్లో వెండి ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలతో, ఎక్కువ మంది పెట్టుబడిదారులు వెండిపై పెట్టుబడులు పెడుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో వెండి ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలతో, ఎక్కువ మంది పెట్టుబడిదారులు వెండిపై పెట్టుబడులు పెడుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక బంగారం ధరలూ అదే రీతిలో దూకుడు చూపిస్తున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.43 లక్షలు, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.31 లక్షలుగా కొనసాగుతోంది. ఈ ఏడాది ఇప్పటికే బంగారం ధర దాదాపు 70 శాతానికి పైగా ఎగబాకింది. ఇది 1979 తర్వాత బంగారానికి లభించిన అతి పెద్ద వార్షిక లాభంగా నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గడం, వచ్చే సమీక్షలోనూ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉందనే అంచనాలు బలపడటం బంగారం-వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు పూర్తిగా తొలగకపోవడంతో, పెట్టుబడిదారులు సుస్థిరమైన పెట్టుబడులుగా భావించే విలువైన లోహాల వైపు మొగ్గు చూపుతున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న నేపథ్యంలో, 2026 ప్రారంభంలోనూ బంగారం, వెండి ధరల పెరుగుదల కొనసాగొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆభరణాల కొనుగోలుదారులతో పాటు పెట్టుబడిదారులూ జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వంటగది నుంచి వెయ్యి కోట్ల సామ్రాజ్యం




- రూ.1,165 కోట్ల నికర విలువతో అగ్రస్థానం
- 'ఖానా ఖజానా'తో దేశవ్యాప్తంగా గుర్తింపు
- ప్రపంచవ్యాప్తంగా రెస్టారెంట్ నెట్‌వర్క్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ వంటకాల రుచులకు విదేశీ పర్యాటకులు మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుడ్ లవర్స్ కూడా ఫిదా అవుతుంటారు. భారతదేశంలో అత్యంత సంపన్నుడైన చెఫ్‌గా సంజీవ్ కపూర్ సక్సెస్ స్టోరీ గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. వంటగది నుంచి వెయ్యి కోట్ల సామ్రాజ్యాన్ని ఆయన తన చేతి వంటతో స్థాపించాడు. తాజా అంచనాల ప్రకారం, సంజీవ్ కపూర్ నికర విలువ దాదాపు రూ.1,165 కోట్లు.1993లో సంజీవ్ కపూర్ తొలిసారిగా 'ఖానా ఖజానా' అనే కుకింగ్ షో ద్వారా టీవీలో భారతీయ ప్రేక్షకులకు వంటల ప్రపంచాన్ని కొత్తగా పరిచయం చేశారు. దాదాపు 17 సంవత్సరాల పాటు నిరంతరంగా ప్రసారమైన ఈ షో, ఆయనకు దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆయన వంటలు వివరించే సరళమైన శైలి, స్పష్టమైన సూచనలు అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గృహిణులు ఆయన వంటకాలకు పెద్ద సంఖ్యలో అభిమానులుగా మారారు. తన బ్రాండ్ ఇమేజ్‌ను సమర్థంగా ఉపయోగించుకొని, ఆయన బలమైన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు. సంవత్సరాల అనుభవంతో ఆయన 150కి పైగా వంట పుస్తకాలను రచించారు. మార్కెట్‌లోకి వచ్చిన ఈ పుస్తకాలు అనూహ్యమైన స్పందన పొందాయి. వాటిలో చాలా పుస్తకాలు బెస్ట్ సెల్లర్లుగా నిలిచాయి. సంజీవ్ కపూర్ సొంతంగా ప్రారంభించిన రెస్టారెంట్లు కూడా ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు సంపాదించుకున్నాయి. భారతీయ వంటకాల నాణ్యతను, రుచిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడంలో ఈ రెస్టారెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అనేక అంతర్జాతీయ వేదికలపై ఆయన తన వంటకాల ప్రతిభను ప్రదర్శించారు. అంతేకాదు, అగ్ర జాతీయ నాయకులు, ప్రముఖులు హాజరయ్యే అధికారిక విందుల్లోనూ ఆయన వంటలు చేశారు. ఇది ఆయన స్థాయిని మరింత ఉన్నతంగా నిలిపింది. ఒక సాధారణ హోటల్ వంటగదిలో ప్రారంభమైన ఆయన ప్రయాణం, ఈ స్థాయికి చేరుకోవడం భారతీయ ఆహార పరిశ్రమ చరిత్రలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన విజయగాథగా నిలిచింది.





## వికెట్ తీసిన బౌలర్‌కు ఆటోగ్రాఫ్ ఇచ్చిన కోహ్లి

- 'కింగ్' కోహ్లి పెద్ద మనసు
- వికెట్ తీసిన బౌలర్‌కు ఆటోగ్రాఫ్
- సోషల్ మీడియాలో హాట్ టాపిక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి దేశవాళీ క్రికెట్‌లోనూ తన క్లాస్ ఏంటో మరోసారి నిరూపించాడు. తాజాగా విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొన్న కోహ్లి, ఢిల్లీ జట్టు తరఫున అదరగొట్టాడు. ఈ మ్యాచ్ లో ఒక విచిత్రం చోటు చేసుకుంది. తనను ఔట్ చేసిన బౌలర్ కే బంతిపై ఆటో గ్రాఫ్ ఇచ్చి, అతనితో కలిసి ఫోటో దిగాడు. గుజరాత్‌తో మ్యాచ్‌లో మరో సెంచరీ దిశగా సాగుతున్న విరాట్ కోహ్లిని గుజరాత్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్ అద్భుతమైన బంతితో ఔట్ చేశాడు. ముందుకు వచ్చి షాట్ ఆడే ప్రయత్నంలో కోహ్లి బంతిని మిస్ చేయగా, వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్ చాకచక్యంగా స్టంపౌట్ చేశాడు. మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లి తన పెద్ద మనసును చాటుకున్నాడు. తన వికెట్ తీసిన విశాల్ జైస్వాల్‌కు ఆ బంతిపైనే ఆటోగ్రాఫ్ చేసి ఇచ్చాడు. అంతేకాదు, అతడితో కలిసి ఫోటో కూడా దిగాడు. ఈ ఫోటోలను జైస్వాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేస్తూ, "టీవీలో అతడి ఆటను చూసిన రోజుల నుంచి, అతడితో మైదానం పంచుకున్న క్షణాల వరకు... గ్రేట్‌ఫుల్ మూమెంట్స్" అంటూ క్యాప్షన్ రాశాడు. ఈ పోస్టుకు అభిమానుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. కొందరు విరాట్ కోహ్లిని కొనియాడుతూ కామెంట్లు చేశారు. ఈ పోస్ట్ కేవలం కొన్ని గంటల్లోనే 53 వేలకుపైగా లైక్స్ సాధించింది. అంతేకాదు, జైస్వాల్ తన బౌలింగ్ వీడియోను కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా, దానికి ఏకంగా 2.7 మిలియన్ వ్యూస్ వచ్చాయి. ఈ మ్యాచ్‌లో విశాల్ జైస్వాల్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 10 ఓవర్లలో 42 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి ఢిల్లీపై ఒత్తిడి తీసుకొచ్చాడు. ఆంధ్రా జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో విరాట్ కోహ్లి 131 పరుగులతో చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్ తో ఢిల్లీ జట్టుకు భారీ ఊపునిచ్చాడు. అనంతరం గుజరాత్‌తో జరిగిన కీలక పోరులోనూ కోహ్లి నిలకడగా ఆడి 77 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా అతడికే దక్కింది. ఢిల్లీ జట్టు ఈ మ్యాచ్‌ను 7 పరుగుల తేడాతో గెలుచుకుంది. ఈ సీజన్‌లో విరాట్ కోహ్లికి ఇదే ఆఖరి దేశవాళీ మ్యాచ్ కానుంది. మ్యాచ్ అనంతరం అతడు ముంబయికి చేరుకున్నాడు. జనవరి 11 నుంచి న్యూజిలాండ్ భారత్ పర్యటనకు రానున్న నేపథ్యంలో, మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది.



## మైదానంలోనే ప్రాణాలు కోల్పోయిన కోచ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బంగ్లాదేశ్ క్రికెట్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ ఢాకా క్యాపిటల్స్ అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జాకీ (59) ప్రాక్టీస్ సమయంలోనే ఆకస్మికంగా మరణించారు. శనివారం సిల్హెట్ వేదికగా రాజాహి రాయల్స్ తో జరగాల్సిన మ్యాచ్‌కు కొద్ది నిమిషాల ముందే ఈ దుర్ఘటన జరిగింది. మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ జరుగుతుండగానే మహబూబ్ అలీ జాకీ మైదానంలోనే అకస్మాత్తుగా కుప్పకూలారు. వెంటనే స్పందించిన ఫిజియోలు ఆయనకు సీపీఆర్ అందించి అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజిషియన్ దేబాశిష్ చౌదరి అధికారికంగా ధృవీకరించారు. మహబూబ్ అలీ జాకీ మరణానికి గల ఖచ్చితమైన కారణాన్ని ఇంకా వెల్లడించలేదు. అయితే ప్రాథమిక అంచనాల ప్రకారం ఆయనకు కార్డియాక్ అరెస్ట్ వచ్చినట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. అంతకుముందు వరకు ఆయన పూర్తిగా ఫిట్‌గా ఉన్నారని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని సహచరులు తెలిపారు. ఈ వార్త తెలియగానే మైదానంలో ఉన్న ఆటగాళ్లు, అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే సిల్హెట్ టైటాన్స్, నోవాఖాలీ ఎక్స్ ప్రెస్, చట్టోగ్రామ్ రాయల్స్ జట్లకు చెందిన ఆటగాళ్లు, కోచ్ లు తమ ప్రాక్టీస్‌ను నిలిపివేసి ఆసుపత్రికి చేరుకున్నారు. మహబూబ్ అలీ జాకీ మృతిపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుతో పాటు అనేక క్రికెట్ వర్గాలు సంతాపం వ్యక్తం చేశాయి. మహబూబ్ అలీ జాకీ బంగ్లాదేశ్ క్రికెట్‌లో ఒక దిగ్గజ పేస్ బౌలింగ్ కోచ్ గా గుర్తింపు పొందారు. 2020లో జరిగిన అండర్ 19 వరల్డ్ కప్‌ను బంగ్లాదేశ్ గెలుచుకోవడంలో బౌలింగ్ కోచ్‌గా ఆయన కీలక పాత్ర పోషించారు. బంగ్లాదేశ్ జాతీయ జట్టుకు స్పెషలిస్ట్ బౌలింగ్ కోచ్‌గా, అలాగే బౌలింగ్ యాక్షన్ రివ్యూ కమిటీ సభ్యుడిగా కూడా ఆయన సేవలందించారు.




## కోఫోర్జ్ చేతికి ఏఐ సంస్థ ఎంకోరా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్ అమెరికాకు చెందిన ఏఐ సంస్థ ఎంకోరా నుండి 100 శాతం వాటాను కొనుగోలు చేసి, చేజిక్కించుకోబోతోంది. దీనికోసం 2.35 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.21,333 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. షేర్ల లావాదేవీ ద్వారా జరిగే ఈ కొనుగోలులో ప్రస్తుతం ఎంకోరా వాటాదార్లకు 1.89 బిలియన్ డాలర్ల ప్రిఫరెన్షియల్ షేర్లను జారీ చేయనుంది కోఫోర్జ్. ఈ లావాదేవీ పూర్తయ్యాక అమ్మకందారులకు కూడా కోఫోర్జ్ లో 20 శాతం వాటా ఉంటుంది. అడ్వెంట్ ఇంటర్నేషనల్, వార్‌బర్గ్ పింకస్, ఇతర మైనారిటీ వాటాదారుల నుండి కూడా ఎంకోరాలో 100 శాతం షేర్ల కొనుగోలు నిమిత్తం ఒప్పందం చేసుకున్నట్లు కోఫోర్జ్ ఎక్స్చేంజిలకు సమాచారమిచ్చింది. 2027 నాటికి ఏఐ ఆధారిత ఇంజనీరింగ్, డేటా, క్లౌడ్ సర్వీసుల విభాగమే ప్రాధాన్యతగా ఉంటుందని, తమ ఏఐ ఆధారిత సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని కోఫోర్జ్ సీఈవో సుధీర్ సింగ్ తెలిపారు.



ఎంత బిజీగా ఉన్నా...

# వర్కవుట్స్ మిస్సవ్వను

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఎంత బిజీ షెడ్యూల్స్ ఉన్నా వర్కవుట్స్ అస్సలు మిస్సవ్వను అంటోంది నేషనల్ క్రష్ రష్మిక మందన్న. ఇటీవల ఒక సందర్భంలో ఆమె మాట్లాడుతూ... ''మొదట్లో వర్కవుట్స్, ఆహార నియంత్రణ ఎవరికైనా చాలా కష్టంగా అనిపిస్తుంది. కానీ ఒక్కసారి అలవాటు చేసుకుంటే అద్భుతాలు గమనించొచ్చు. సహజంగానే ప్రయాణాలంటే నాకు చాలా ఇష్టం. కాస్త విరామం దొరికితే విదేశాల్లో వాలిపోతా. 'యానిమల్' విడుదలయ్యాక నా గురించి చాలా రకాలుగా ట్రోల్ చేశారు. ఒక డైలాగ్ దగ్గర నా ఎక్స్‌ప్రెషన్ బాగాలేదని సోషల్ మీడియాలో విమర్శించారు. నటిగా అరంగేట్రం చేసినప్పటి నుంచి నాపై ఈ విమర్శల దాడి జరుగుతూనే ఉంది. మొదట్లో ఇలాంటివి చూసి బాధపడేదాన్ని. దేనికైనా ఒక పరిమితి ఉంటుంది. అది మితిమీరితే మాత్రం నా స్టయిల్ లో ఘాటుగా స్పందిస్తా. 'యానిమల్'లో రణ్‌బీర్‌ను కొట్టే సన్నివేశం నటిగా నాకొక సవాల్ అనిపించింది. ఆ సన్నివేశంలో భావోద్వేగాలు బలంగా పండాలని, చాలా సహజంగా సీన్ రావాలని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా చెప్పారు. కేవలం ఆ ఒక్క మాటే నేను గుర్తుపెట్టుకున్నా. 'యాక్షన్' అనగానే రణ్‌బీర్ మీద కేకలు వేస్తూ, కోపంతో అతడి చెంపపై కొట్టా. 'షాట్ ఓకే' అని దర్శకుడు చెప్పినా నా కన్నీళ్లు మాత్రం ఆగలేదు. బాగా ఏడ్చేశా. దాదాపు ఎనిమిది నిమిషాల నిడివి గల ఆ సన్నివేశాన్ని కేవలం సింగిల్ టేక్‌లో పూర్తి చేశా'' అంటూ చెప్పుకొచ్చింది.

## ప్రేమ నిప్పులాంటిది... అది రెండు జీవితాలకు

# వెలుగునిచ్చే దీపం



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలు'. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చార్మింగ్ స్టార్ శర్వానంద్ ఈ సినిమా ట్రైలర్ ని లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా హీరో శర్వా మాట్లాడుతూ.. తుకారం ఎలాంటి ఇండస్ట్రీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినిమా మీద పాషన్ తో ఇక్కడికి వచ్చాడు. ఈ టీజర్ చూస్తుంటే చాలా అద్భుతంగా ఉంది. చాలా నిజాయితీగా తీశాడు. ట్రైలర్ చూసిన తర్వాత ఈ సినిమా చూడాలనే ఆసక్తి ఏర్పడింది. వర్ధన్ ని చూస్తుంటే ఫస్ట్ సినిమా లాగా అనిపించలేదు. తను చాలా ప్రామిస్ గా కనిపిస్తున్నాడు. ఈ సినిమా టీమ్ అందరికీ చాలా మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను. ''ప్రేమ నిప్పులాంటిది. అది రెండు జీవితాలకు వెలుగునిచ్చే దీపం అవ్వచ్చు.. లేదా అడవిని దహించే కార్చిచ్చుగా మారొచ్చు''అనే డైలాగ్ తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రేమకథలోని డెప్త్ ఆడియన్స్ కి వెంటనే కనెక్ట్ అవుతుంది. లీడ్ పెయిర్ వర్ధన్, కృష్ణప్రియ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా ఉంది. స్క్రీన్‌పై వారి ఎమోషన్స్ హార్ట్ టచింగ్ వున్నాయి. ఎంజీఆర్ తుకారాం టేకింగ్ అద్భుతంగా వుంది. విజువల్స్, నేపథ్య సంగీతం అన్నీ గ్రాండ్ గా వున్నాయి ఎమోషన్స్, యాక్షన్, హృదయాన్ని తాకే ప్రేమ కథ తో ట్రైలర్ సినిమాపై క్యురియాసిటీ పెంచింది.

# పతంగ్ అందరూ చూడాల్సిన సినిమా!

## ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్-హీరో సందీప్‌కిషన్



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందిన చిత్రం 'పతంగ్' ఈ చిత్రం సినిమాటిక్ ఎలిమెంట్స్ , రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ప్రణీత్ పత్తిపాటి దర్శకుడు. పాపులర్ దర్శకుడు నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. క్రిస్మస్ కానుకగా విడుదలైన ఈ చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా మంచి రెస్పాన్స్ ను రాబట్టుకుంది. కాగా ఈ చిత్రం సక్సెస్ మీట్ ను నిర్వహించారు. ఈ టీమ్‌ను అభినందించడానికి కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్, హీరో సందీప్‌కిషన్‌లు ఈ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ సినిమా చూశాను. చూడగానే ఈ మధ్య కాలంలో వన్ ఆఫ్ ద బ్యూటిఫుల్ ఫిలిం. బ్యూటిఫుల్ ఎమోషన్స్. సినిమా చాలా జెన్యూన్‌గా అనిపించింది. ఈ సినిమాను నిర్మాతలు డబ్బుతో కాకుండా ఎంతో ప్రేమతో మనసుపెట్టి తీశారని అనిపించింది. ఈ సినిమాలో అందరి పాషన్ అనిపించింది. అందుకే నేను ఎంతో బిజీగా ఉన్న ఈ టీమ్‌ను ఎంకరైజ్ చేద్దామని ఇక్కడికి వచ్చాను. ఈ మంచి సినిమాను మీడియా మరింత ప్రమోట్ చేయాలని కోరుతున్నాను. మీడియా ఈ సినిమాకు సపోర్ట్ అవసరం. నిజాయితీగా ఓ మంచి సినిమా తీసిన పతంగ్ టీమ్‌ను ఎంకరైజ్ చేయండి. ఈ సినిమాలో లవ్‌బుల్ ఎమోషన్స్ ఉన్నాయి. కైట్స్ పోటీ చూస్తే నాకు సంక్రాంతి గుర్తొచ్చింది. కైట్ కాంపిటీషన్ సీన్స్ చాలా బాగున్నాయి.



స్వప్న సినిమాస్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'ఛాంపియన్'. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషించారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిమ్స్‌తో కలిసి నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ నిర్వహించారు.

# 'ఛాంపియన్' సక్సెస్

## గొప్ప ఆనందాన్నిచ్చింది: నిర్మాత స్వప్న దత్

'ఛాంపియన్' నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. స్వప్న అక్క నాకు ఎంతగానో సపోర్ట్ చేసింది. తనకి సినిమా అంటే చాలా పాషన్ సినిమా కోసం ఏమైనా చేస్తుంది. కిరణ్ గారికి థాంక్యూ, అలాగే జీకే గారికి, మా నిర్మాతలు అందరికీ థాంక్యూ సో మచ్. - హీరో రోషన్

అద్భుతమైన విజయాన్ని ఇచ్చి మమ్మల్ని ఛాంపియన్స్ చేసిన ఆడియన్స్ కి థాంక్యూ. ఛాంపియన్ నా మొదటి తెలుగు సినిమా. థియేటర్స్ లో కూర్చుని ఆడియన్స్ రియాక్షన్ చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇలాంటి ఎక్స్పీరియన్స్ ని నేను గతంలో ఎప్పుడూ చూడలేదు. - హీరోయిన్ అనస్వర రాజన్

మా సినిమాని బ్లాక్ బాస్టర్ చేసిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ. రివ్యూలతో సినిమాని ముందుకు తీసుకెళుతున్న మీడియా అందరికీ థాంక్యూ సో మచ్. ఛాంపియన్ సినిమా మీ ముందుకు రావడానికి కారణం స్వప్న గారు కిరణ్ గారు జి కే గారు జి స్టూడియోస్,. మా నిర్మాతలు అందరికీ థాంక్స్. నాలుగేళ్ల క్రితం ఈ కథని స్వప్న గారికి చెప్పాను. అప్పుడే ఈ సినిమా చేస్తున్నామని సైన్ చేశారు. ఈ సినిమా విషయంలో 100 శాతం స్వేచ్ఛని ఇచ్చారు. సినిమాకి అన్ని వైపుల నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. – డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం

మా సినిమాని బ్లాక్ బాస్టర్ చేసిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ. రివ్యూలతో సినిమాని ముందుకు తీసుకెళుతున్న మీడియా అందరికీ థాంక్యూ సో మచ్. ఛాంపియన్ సినిమా మీ ముందుకు రావడానికి కారణం స్వప్న గారు కిరణ్ గారు జి కే గారు జి స్టూడియోస్,. మా నిర్మాతలు అందరికీ థాంక్స్. నాలుగేళ్ల క్రితం ఈ కథని స్వప్న గారికి చెప్పాను. అప్పుడే ఈ సినిమా చేస్తున్నామని సైన్ చేశారు. ఈ సినిమా విషయంలో 100 శాతం స్వేచ్ఛని ఇచ్చారు. సినిమాకి అన్ని వైపుల నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. – ప్రొడ్యూసర్ స్వప్న దత్

మిక్కీ జే మేయర్ మాట్లాడుతూ.. రోషన్ అనస్వర అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చారు. బ్యాగ్రౌండ్ స్కోర్ చేస్తున్నప్పుడే చాలా థ్రిల్లయ్యాను. ఈ సినిమాలో అందరూ కూడా అద్భుతంగా పెర్ఫాం చేశారు. నన్ను బిలీవ్ చేసినందుకు స్వప్న గారికి ప్రదీప్ గారికి థాంక్యూ. మా మ్యూజిక్ టీమ్ అందరికీ థాంక్యూ

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఇంద్రా కంపెనీ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.4గా.. కొర్రాల సుబ్బారెడ్డి కొత్త ప్రయత్నంగా తెరకెక్కుతున్న 'వాంటెడ్ బాయ్ ఫ్రెండ్ (వస్తే వదలం)' చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రామ సత్యనారాయణ మాట్లాడుతూ.. క్రిస్మస్ సందర్భంగా సుబ్బారెడ్డి డైరెక్టర్‌నిర్మాతగా ఇంద్రా కంపెనీ బ్యానర్‌లో కొత్త సినిమా తీసేందుకు ముందుకు రావడం అభినందనీయం. కొత్త డైరెక్టర్లు, కొత్త ఆర్టిస్టులు ఇండస్ట్రీకి అత్యవసరం. లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి వంటి చిన్న బడ్జెట్ సినిమాలు పెద్ద హిట్ అయ్యాయి. అదే కోవలో ఈ చిత్రమూ పెద్ద విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. దర్శకనిర్మాత కొర్రాల సుబ్బారెడ్డి మాట్లాడుతూ ..తెలుగు సినిమాల్లో యువతకు కనెక్ట్ అయ్యే కంటెంట్‌కి డిమాండ్ పెరుగుతోంది. ఈ చిత్రంలో స్త్రీ భావప్రపంచం, ప్రేమ, నమ్మకం, ద్రోహం, క్రైమ్ - ఇవన్నీ సస్పెన్స్‌తో మిళితమై యూత్‌ఫుల్ రొమాంటిక్‌క్రైమ్ ఎమోషనల్ డ్రామాగా సాగుతుంది. నా కథకు ప్రధాన బలం, అన్ని వయసుల ప్రేక్షకులు ఈ కథతో కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను" అన్నారు. ఇంద్రా కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ.. కెమెరామెన్ సూర్య ముంబై లో పెద్ద డీఓపీ . ఆయన అద్భుతమైన విజువల్స్ అందించ బోతున్నారు. సంగీత దర్శకులు విజయ్ బొల్లాఅర్జున్ దేవ్ సంగీతం యువతను అలరించేలా భావోద్వేగాలను పెంచేలా సిద్ధమౌతున్నాయి. షూటింగ్ హైదరాబాద్, గోవా ప్రాంతాల్లో మార్చి నుండి రెగ్యులర్‌గా జరుగుతుంది.





## వాంటెడ్ బాయ్ ఫ్రెండ్ ఫస్ట్ లుక్ పోస్టర్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నిధి అగర్వాల్ ప్రస్తుతం ప్రభాస్ తో కలిసి ది రాజా సాబ్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వచ్చే ఏడాది జనవరి 9వ తేదీన సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా విడుదల కాబోతోంది. ఈ చిత్రానికి హారర్ కామెడీ బ్యాక్ డ్రాప్ లో ప్రముఖ డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహించారు. ఇకపోతే విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో...

ఈ సినిమా ప్రమోషన్స్ కార్యక్రమాలలో పాల్గొంటున్న నిధి అగర్వాల్ పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. అందులో భాగంగానే ది రాజా సాబ్ సినిమా విశేషాలు కూడా పంచుకోవడం గమనార్హం. ది రాజా సాబ్ సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుంది. ముఖ్యంగా ఇందులో ప్రతి ఒక్కరి పాత్రకు ప్రాధాన్యత ఇచ్చారు. అటు ప్రభాస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయన హైట్ ను ఈ సినిమాలో నేను బ్యాలెన్స్ చేయడానికి పెద్ద హీల్స్ వేసుకొని.. యాపిల్ బాక్సులపై నిలబడి మరీ సహానా పాటను షూట్ చేశాము. ఈ పాట చాలా కొత్తగా ఉంటుంది. కాస్ట్యూమ్స్ కూడా కలర్ ఫుల్ గా ఉంటాయి అంటూ తెలిపింది. ది రాజా సాబ్ సినిమా విడుదల అయిన తర్వాత నా అప్కమింగ్ ప్రాజెక్టుల గురించి ప్రకటిస్తాను. 2026 మొత్తం నేను బిజీగానే ఉండబోతున్నాను. చాలా భాషలలో సినిమాలు చేస్తున్నాను. అటు తెలుగులో కూడా మూడు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను అంటూ తెలిపింది.

# నేను బ్యాలెన్స్ చేయడానికి పెద్ద హీల్స్ వేసుకున్నాను...



వెర్సటైల్ యాక్టర్ ఆది హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'శంబాల'. ఈ మూవీకి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఈనెల 25న రిలీజ్ చేశారు. ప్రీమియర్లతో మొదలైన పాజిటివ్ టాక్‌తో డే వన్ అద్భుతమైన వసూళ్లను సాధించింది. ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోండటంతో దర్శకుడు **యుగంధర్ ముని**తో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..



# శంబాల ప్రయాణం అలా మొదలైంది?

- మూడేళ్ల క్రితం ఈ పాయింట్ అనుకున్నాను. నాకు రాజశేఖర్ గారితో ఐదేళ్ల నుంచి అనుబంధం ఉంది. ఈ పాయింట్‌ను ఆయనకు చెప్పాను. ఆ కథ నిర్మాత గారికి చాలా నచ్చింది. ఆ తరువాత మహిధర్ గారు వచ్చారు. అలా మా ఈ జర్నీ మొదలైంది.
- దర్శకుడిగా ఈ కథను ఎంతో బాధ్యతతో రాసుకున్నాను. నేను చెప్పే కథను చాలా మంది చూస్తారు. ఎంతో నేర్చుకుంటారు. ఏ ఒక్కరినీ బాధపెట్టకూడదు. సైన్స్, శాస్త్రానికి మధ్య బాలెన్స్ చేయాలని, ఎవ్వరి మనోభావాల్ని దెబ్బ తీయకూడదని ముందే అనుకున్నాను.
- 'శంబాల' రెస్పాన్స్ చూసి నాకెంతో ఆనందంగా ఉంది. హౌస్ ఫుల్ బోర్డులు పడినా కూడా గేట్లు తన్నుకుంటూ వెళ్తున్నారు. ఇవన్నీ నేను చిన్నప్పుడు చిరంజీవి సినిమాలకు చూశాను. ఇప్పుడు ఇలా నా మూవీకి అన్ని చోట్లా అద్భుతమైన స్పందన రావడం ఆనందంగా ఉంది. తమిళనాడు, కర్ణాటకలోనూ మా సినిమాకు మంచి స్పందన వస్తోంది.
- ఇండస్ట్రీ నుంచి చాలా మంది ఫోన్స్ చేశారు. హీరోలు, దర్శక, నిర్మాతలందరూ ఫోన్స్ చేసి అభినందిస్తున్నారు. ఆది గారు ఈ మూవీ విజయం పట్ల ఆనందంగా ఉన్నారు. ఆయన ఇలాంటి ఓ సక్సెస్ కోసం చాలా కష్టపడుతూనే వచ్చారు. సెట్‌లో ఎన్ని గాయాలైనా కూడా ఆయన ఎక్కడా తగ్గకుండా వర్క్ చేశారు.
- ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాలకి నా స్క్రిప్ట్ గురించి ముందే వివరించాను. నాకు ఎలా కనిపించాలి? నా విజన్ ఏంటి? అని ఇలా అన్నీ ముందుగానే క్లియర్‌గా చెప్పాను.
- ఆది గారు స్క్రిప్ట్‌లో ఎక్కువగా ఇన్ పుట్స్ ఇవ్వలేదు. కథా చర్చల టైంలో ఆది గారు సలహాలు ఇచ్చారు. కానీ ఒక్కసారి స్క్రిప్ట్ లాక్ అయిన తరువాత ఆయన మళ్లీ ఛేంజెస్ చెప్పలేదు. ఆయన చెప్పింది చెప్పినట్టుగా నటించుకుంటూ వెళ్లారు.
- ఉల్క పడిన ప్రాంతం ఎలా ఉంటుంది? అనే విషయంలో చాలా రీసెర్చ్ చేశాను. ఉల్క పడితే ఏం జరుగుతుంది? దాని చుట్టూ ప్రాంతం ఎలా ఉంటుంది? అని బ్రెజిల్‌లో జరిగిన ఘటనల మీద పరిశోధన చేశాం.
- ప్రాణవాయువు అని మనకు ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. ఆక్సిజన్ అని కొన్నేళ్ల క్రితం కనిపెట్టాం. రావి చెట్టు, తులసి చెట్టు, వేప చెట్టు నుంచి ప్రాణ వాయువు వస్తుందని మన పురాణాలు చెబుతాయి. అందుకే ప్రతీ ఇంట్లో వాటిని పెంచుకునేవారు. ఇప్పుడు సైన్స్ అని చెబుతాం. కానీ మనకు ఇవన్నీ ఎప్పటి నుంచో మన కల్చర్‌లోనే ఉంటాయి.
- శ్రీ చరణ్ పాకాల సౌండింగ్ చాలా యూనిక్‌గా ఉంటుంది. సిద్దార్థ్ అనే వ్యక్తి సౌండ్ డిజైనింగ్ అద్భుతంగా చేశారు. విష్ణు గొప్పగా మిక్సింగ్ చేశారు.

- ఎం.డి అబ్దుల్

## చిన్న సినిమాలకు..



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

చిన్న సినిమాలను ప్రోత్సహించడం కోసం ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ తరపున అవార్డులను బహుకరించనున్నట్లు అధ్యక్షుడు కె.ఎస్.రామారావు వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో కొద్దిసేపు ముచ్చటిస్తూ...ఈ ఏడాది పది కోట్ల లోపు బడ్జెట్ తో నిర్మించిన చిన్న సినిమాలకు ఈ అవార్డులను అందజేస్తామని చెప్పారు. ఈ నెల 31న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రధానం చేస్తామని అన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో విడుదలైన 'కోర్ట్'ను ఉత్తమ చిత్రంగాను, 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం నుంచి అఖిల్ రాజ్ ను ఉత్తమ హీరోగాను, ఉత్తమ హీరోయిన్ గా తేజస్వీరావు, ఉత్తమ దర్శకుడిగా సాయిలు కంపాటికి అవార్డులు అందజేస్తామని ఆయన తెలిపారు. వీరితో పాటు సినిమా పరిశ్రమలో 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న నిర్మాతలు అశ్వనీదత్, అల్లు అరవింద్ లను సన్మానించనున్నట్లు ఆయన వివరించారు. ఫిల్మ్ నగర్ క్లబ్ అభివృద్ధికి కృషి చేసిన కాజా సూర్యనారాయణను కూడా ఈ సందర్భంగా సన్మానిస్తామని ఆయన చెప్పారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**